శ్రీ

శ్రీ కురుమూర్తి శ్రీనివాస పరబ్రహ్మణేనమః ॥

శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య,
శ్రీ భగవద్రామానుజ సిద్ధాంతనిర్ధారణ
సార్వభౌమేత్యాద్యనేక బిరుదవిరాజితులై
శ్రీమన్మహిశూరపురాధీశ జయచామరాజేంద్ర
కంఠీరవ సార్వభౌమవంశ పరంపరాచార్య
శ్రీ బ్రహ్మతంత్రపరకాల మఠపీఠ
మూర్ధాభిషిక్తులై వేంచేసియుండు
శ్రీ శ్రీ లక్ష్మీహయగ్రీవ
దివ్యపాదుకాసేవక శ్రీ శ్రీ శ్రీమత్.

"అభినవరంగనాథ"

బ్రహ్మతంత్రపరకాలస్వామివారి వైభవము.

శ్రీమత్ ముక్కర సవై, రాజా,
"శ్రీరామభూపాల" బల్వంతు, బహాదూరు,
అమర చింతాత్మకూరు సంస్థానాధీశ్వరుల
పట్టంపు పత్నియగు సవై, రాణీ,
"భాగ్యలక్ష్మమ్మ" దేశాయి అమర
చింతాత్మకూరు సంస్థానాధిపతులచే ముద్రించి
ప్రచురింపబడియె॥.

యునైటెడ్ ప్రింటింగ్ ఒర్క్స్, కంచి.

Gopala Chary.

దాసస్య విజ్ఞాపనము

శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యులై శ్రీ బ్రహ్మతన్త్రస్వతంత్ర కాల మతాధీశ్వరులై నేంచేసియుండు శ్రీమదభినవరంగనాథ బ్రహ్మతన్త్రస్వతంత్ర కాల మహాదేశికుల దివ్యప్రభావము సత్యముగ అవాఙ్మనసగోచరమే. శ్రీవారి జ్ఞానానుష్ఠాన సామ్రాజ్యమును దాసుడు 3. ర. పర్యంతములు సాక్షాత్తుగ ననుభవించి * న భూతో న భవిష్యతి యను లోకోక్తికి ఈ స్వాములవారొకరే ప్రధాన లక్ష్యభూతులని నిశ్చయించి శ్రీవారి దివ్యపాదపద్మములో త్రికరణశుద్ధమై అకృత్రిమమైన అభినివేశమును పొంది స్వరూపానురూపమైన కించిత్కారము చేయవలయునని మనోరథించి శ్రీవారివైభవమును ఆంధ్రద్రావిడ సంస్కృతాది భాషలలో యథాశ్రుతముగ సంక్షేపముగ వ్రాసి శ్రీవారిపాదారవింద పరిసరములో సమర్పించుచున్నాడను.

ఇతినతయః

కంచి. ప్రతివాదిభయంకర

అణ్ణంగరాచార్యదాసుడు.

మైసూరు శ్రీ లక్ష్మీహయగ్రీవ దివ్యపాదుకాసేవక

శ్రీమదభినవరఙ్గనాథ బ్రహ్మతంత్రస్వతంత్ర కాల మహాదేశికులయొక్క-

పూర్వాశ్రమ దివ్యమఙ్గళవిగ్రహాచ్ఛాయ.

(శ్రీ. విద్వద్వరేణ్యాః. అత్తకూర్ రఙ్గాచార్యస్వామిపాదాః.)

శ్రీరస్తు.

శ్రియఃకాన్తాయ నమః. శ్రియై నమః.

శ్రీమతే లక్ష్మీహయవదన పరబ్రహ్మణే నమః.

శ్రీమతే నిగమాన్తమహాదేశికాయ నమః.

శ్రీ లక్ష్మీహయగ్రీవ దివ్యపాదుకాసేవక శ్రీమదభినవరఙ్గనాథ

బ్రహ్మతన్త్రపరకాల

మహాదేశిక వైభవము.

శ్రేయుర్దేతారణాబ్దే గతవతి తరణౌ కర్కటాభిఖ్యరాశిం
దశ్యేతిథ్యాం పునర్వస్వభిధ ఉడువరే వాసరేభూమినూనోః।
ప్రాదుర్భూతోమహాత్మాహితకులమణేరాఘవాచార్యసూరే
స్సత్పుత్రో రఙ్గనాథో గురురనఘగుణాన్సారవర్య స్సమిద్ధే॥

— ఉపోద్ఘాతము. —

శ్రీయఃపతియు, అవాప్తసమస్తకాముడునగు పరమపురుషుడు అపారసంసారసాగరాన్తర్నిమగ్నులై మునుగుచు దేలుచు బాధపడుచుండు మనవంటి నంసారిచేతనుల నుద్ధరించుటకుతగు అనేకప్రయత్నముల నెల్లప్పుడును చేయుచున్నాడనుట సుప్రసిద్ధమేగదా. శ్లో॥ హార్దంతమస్స దసతీచ వివేక్తుమీశో మానం ప్రదీపమివ కారుణికో దదాతి॥ అనునటుల మనకాపరమపురుషుడు సాఙ్గోపాఙ్గవేదశా

స్త్రీదుల నొసఁగి చేసిన ప్రయత్నము మొదటిదియైయున్నది. ఈప్రథమప్రయత్నమున కొందఱు చపలులై శలభాగ్ని న్యాయము ననుసరించుటవలన(మిడతలు అగ్నియందుపడుట) తాఁజేసిన ప్రథమ ప్రయత్నము విపరీతఫలముగలదగుటచేత తానే సాక్షాత్తుగ భూమియందవతరించి శిష్యరక్షణాదులను జేయనారంభింపగ అదిఫలింపక * పరంభావమజానన్తః - అవజానన్తి మాం మూఢాః * అనునట్లు నిర్వేదమునుజెంది తనపాదారవింద సేవాసక్తులగు సద్భక్తులనుగానక దుఃఖపరంపరాపరిపూరిత మనస్కుఁడై యోచించి తుదకు సజాతీయులును జ్ఞానానుష్ఠాన సంపన్నులునైన మహనీయుల నవతరింపఁజేసి వారిద్వారా తనకోరికను పూర్తిజేసికొనదలంచి పరాంకుశ పరకాలాది దివ్యసూరివర్యులను శ్రీమన్నాథమునియామునమునియతివరాద్యాచార్యవర్యులను పుడమి నవతరింపఁజేసి వీరివలన తనకోరిక చక్కగ నెఱవేరినందున సంతుష్టాంతరంగుఁడై "ఈలాగే యాయాకాలములందు ఆచార్యవర్యుల నవతరింపఁజేసి సఫలమనోరథుఁడుగాగలను" అను పట్టుదలతో సకలసద్గుణ సంపన్నులగు ఆచార్యపర్యులను భూమియందవతరింపించి వారు లోకోజ్జీవనమును గాపింపగ చూచి కృతకృత్యుఁడై మెఱయుచున్నాడనియు, శ్లో॥సాక్షాన్నారాయణోదేవఃకృత్వా మర్త్యమయీంతనుమ్।మగ్నానుద్ధరతే లోకాన్కారుణ్యాచ్ఛాస్త్రపాణినా॥ అను ప్రమాణంబిత్తా శ్రీమన్నారాయణుఁడే ఆచార్యులుగ నవతరించి చాల జాలిగలవాఁడై సంసారసముద్రమున మునిగియున్న చేతనులను శాస్త్రహస్తముచే

లేవనెత్తుచున్నాడనియు ఇఱుతెఱఁగుల పెద్దలు శాస్త్రముల ననుసరించి నుడువుచున్నారు.

పైప్రమాణాళిక ననుసరించి శ్రీయఃపతి శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీమదభినవరఙ్గనాథ బ్రహ్మతన్త్ర పరకాల యతీన్ద్ర మహాదేశికులని ప్రసిద్ధిగలిగి నిరవధికమహిమగల ఆచార్యసార్వభౌముల నవతరింపించి శాశ్వతమగు తనసంసారిచేతనోజ్జీవనదీక్షను పెంపొందించుచున్నాడని సంగ్రహముగ విన్నవించుటకొఱకు అనర్ఘావకాశముచేకూరినది.

శ్లో॥ ఆచినోతిహి శాస్త్రార్థా నాచారేస్థాపయత్యపి। స్వయమాచరతే యస్మాత్తస్మాదాచార్య ఉచ్యతే ॥ అని మహర్షులును, శ్లో॥ సిద్ధం సత్సంప్రదాయే స్థిరధీయమనఘం శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం సత్త్వస్థం సత్యవాచం సమయనియతయా సాధువృత్త్యా సమేతమ్। దమ్భాసూయావిముక్తం జితనిపుయిగణం దీక్షుబన్ధుం దయాలుం స్థాలిత్యేశాసితారం స్వపరహితపరం దేశికం భూష్ణుకీర్పేత్॥ అని శ్రీమన్మహాస్తనుహాదేశికులును నిరూపించియుండు ఆచార్యలక్షణము నిస్సనూభ్యధికముగ నిండియుండు శ్రీస్వాములవారి వైభవము అవాఙ్మనసగోచరమైనను "కీటస్య తృష్ణత ఉదన్వతి విప్రుషాలం" (దప్పిగల పురుగునకు సముద్రమున నొక బిందువే చాలును) అనున్యాయము ననుసరించి బుద్ధిగోచరమైనంతవఱకు ఇంచుకైనను అనుభవించి జన్మసాఫల్యమునుపొంది ధన్యవాగ్వైభవముగలవారగుచున్నాము.

ఇట్లు ఉపోద్ఘాతము ముగిసెను.

వైభవవర్ణనోపక్రమము. శ్రీ స్వామివారి సద్వంశప్రశంస.

సద్వంశశీల విద్యాదిసంపన్నులే ఆచార్యపీఠము నలంకరించుటకర్హులు అనుట సుప్రసిద్ధము గనుక శ్రీస్వాముల వారికి దైవవశమునఘటించియుండు ఆభిజాత్యమును (సద్వంశసంభవము) మొదటనిరూపించెద —శ్రీ విశిష్టాద్వైతసిద్ధాన్త నిర్ధారణధురంధరులైన భగవద్రామానుజాచార్యులవారి మువ్వారముచే వన్నెకెక్కి-నట్టి హారితగోత్రమున ఆసూరివంశమునందు మనస్వామివారతరించిరి.

భాగ్యలక్ష్మికిని తదితరసకలభాగ్యములకును ఉనికిపట్టగుటవలన భాగ్యనగరమని పురాతనసంజ్ఞగల దక్షిణహైదరాబాదు రాజధానీపీఠమునందు (హుబ్బాబు నగర్) పాలమూరను సుప్రసిద్ధాగ్రహారముగలదు. ఇచ్చట శ్రీమద్వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్యులును, ఉభయవేదాన్త ప్రవర్తనధురంధరులునైన. "ఆసూరి కారంబేడు హరిదాసాచార్యులను పరమభాగవతోత్తములు వెలయుచుండిరి. ఈ వంశమునందు ఆసూరి అప్పలాచార్యులను గురువరులుద్భవించి ఆ నైజామురాజ్యమునందు స్వయంవ్యక్త దివ్యమూర్తియైన శ్రీవేంకటేశ్వరునిసాన్నిధ్యమువలన ధన్యతనుపొంది "అంజనగిరి" అని సుప్రసిద్ధమైన ఒక పర్వతమునకు సమీపమున "మానాజిప్యాటి" అను అగ్రహారమునందు పూర్వోక్తదేవాలయధర్మకర్తృస్థానమునలంకరించిరి. ఈ అగ్రహారమునకించుకదూరముననుండు ఖిల్లాగణపురంబను గ్రామమున శ్రీమద్రహస్యత్రయసారవ్యాఖ్యాతలలో నొకరగు (సారవివరణకృత్పాద)

శ్రీనివాసాచార్యులు నివసించియుండిరి. దీనికి కించిద్దూరమునందు "అమరాబాదు, గ్రామమున, శ్రీ భాగవతవ్యాఖ్యాత యైన శ్రీ వీరరాఘవసూరివర్యుడుండెనని జగత్ప్రసిద్ధము.

శ్రీ స్వామివారి పితామహచరితము.

పూర్వోక్త అప్పళాచార్యులవారి కుమారులైన పవిత్ర నామధేయచరిత్రముగల శ్రీమాన్ రంగాచార్యులవారు తన పూర్వికులతోపాటు వేదాధ్యయనసంపన్నులు సముచిత శాస్త్రజ్ఞులు సదనుష్ఠానసమృద్ధులు విశేషించి మంత్రశాస్త్ర ప్రవీణులు. మంత్రశాస్త్రమునందలి బహువిధరహస్యముల లోని ధారణమంత్రపూజ్యమంత్రక్రమములలో అధిక ప్రఖ్యాతిగలవారు. వశీకరణాకర్షణోచ్చాటనమారణ మోహనస్తంభన ప్రక్రియలందును నమస్స్వాహాహుంఫట్ ఇత్యాదిపల్లవితములలో నతిసమర్థులు. గారుడనారసింహహయగ్రీవకృష్ణమంత్రాద్యనేక మహా మంత్రరహస్యసర్వస్వమునెఱిగినవారు. తన్మంత్రానుష్ఠానస్థాపన విశారదులు.

ఒకానొకప్పుడు ఈ మహనీయుడు పూర్వోక్తమహామంత్రములలో నారసింహమంత్రోపాసనచేయతలంచి "యంత్రములేనిచో పూజ్యదేవత ప్రసన్నముగానేరదు" అను ప్రమాణముననుసరించి నృసింహయంత్రస్థాపనముజేసి, సముచిత కాలవిశేషములలో జపసంఖ్యానుగుణముగ హోమతర్పణాభిషేకార్చన నీరాజన నమస్కారాదులను తత్తద్ధాంశక్రమముగ ఖ్యాతిలాభపూజానిరపేక్షులై

పరమపురుషార్థైక ప్రయోజనబుద్ధితో యథోక్తనియమముతో ననుష్ఠించిరి. ఈలాటివిశేషానుష్ఠానములచే మంత్రసిద్ధినిబొంది మహాసీయాగ్రేసరులై విలసిల్లు ఆనూరి రంగాచార్యులవారి ప్రభావాదులనెఱింగిన భక్తులనేకులు వీరిపరమకృపాప్రవాహమునకుపాత్రులై బ్రహ్మగ్రహాదిసకలారిష్టములనుతొలిగించుకొని సంతుష్టులైరి. ఈ మహాసీయునిచేత శ్లో॥ యత్రాష్టాక్షరనంసిద్ధో మహాభాగోమహీయతే। నత్రత్ర సంచరిష్యంతి వ్యాధిదుర్భిక్షతస్కరాః॥ అను ప్రమాణము సార్థకమైనది యనుట అతిశయోక్తిగానేరదు.

ఇటుల మంత్రసిద్ధుడగు ఈ మహానుభావుని కొందఱు ధార్మికులు దమతమగృహములకు వేంచేపుజేసికొనిపోయి యచట నృసింహయంత్ర తదారాధనాదులను గావించుకొని యపూర్వాతిశయములనుగాంచి సంతసించిరి. ఈమహానీయులు ఒక గొప్పవస్త్రమును శోధించి నేతిలోతడిపి వెలిగించి గొప్పపాత్రయందునిచి యాపాత్రను స్వహస్తముతో పట్టుకొని మధ్యమధ్యే నేతిధారను విడుచుచు సుమారు రెండు ఘంటలకాలము జ్వాలానృసింహ జ్వాలానృసింహ యని ఘోషించుచు మంగళహారతి జేయుదురు. ఈలాటి ఆశ్చర్యకృములను సాక్షాత్కరించిన మహానీయులు కొందఱు ఆప్రాంతముల నిప్పటికిని ఉన్నారు. ఈలాటి నీరాజనకార్యమువలన వీరికి "మంగళారతి రంగాచార్యులు" అని వ్యవహారమేర్పడినది. ఈ వ్యవహారమిప్పటికిని ఆ ప్రాంతములందీకుటుంబము వారికిని గలదు.

శ్రీవారి పితృప్రభావము.

పూర్వోక్తవైభవభాసమానులగు రంగాచార్యులవారికి ఆనూరి కారంబేడు మంగళారతి రాఘవాచార్యులను కుమారులవతరించిరి. వీరును తమ పూర్వికులవలెనే వేదాధ్యయన సంపన్నులును పరమసాత్వికులును భగవద్భాగవత కైంకర్య నిష్ఠులునై విలసిల్లుచుండగ నొకనాటిరాత్రి యోగదశావసాన సమయమున భగవంతుడు వృద్ధబ్రాహ్మణరూపియై స్వప్నమున దర్శనమిచ్చి "త్వరలో సత్సంతానసమృద్ధి గలుగగలదని" అనుగ్రహించి అంతర్ధానమాయెను. తరువాత నీ మహానీయుండు బ్రాహ్మ ముహూర్తమున మేల్కొని స్వప్న వృత్తాంతమును స్మరించి సంతుష్టాంతరంగులై శ్రీ నృసింహ స్వామియనుగ్రహమేయని తలంచిరి. తరువాత అతి త్వరలో వీరి ధర్మపత్నియైన సౌభాగ్యవతి "శేషాంబా" గర్భమును దాల్చెను. యథాకాలము శాస్త్రీయపుంసవనాదిసంస్కార సంస్కృతయైనయాగర్భము శుక్లపక్షచందురునిపగిది వర్ధిల్లుచుండుటచే యాబిడ్డముఖమునకుగలిగిన దివ్యతేజోవిశేషమును జూచిన మహానీయులు "ఈగర్భమునధిష్ఠించియుండు వ్యక్తి విశేషము అనన్య సామాన్యగుణగణసంపన్నుడైన ఒక మహాపురుషుడుగనుండనోపు"నని పలుమారు నుడువుచుండిరి.

శ్రీ స్వామివారియవతారము.

భవ్యేఽబ్దేతారణాఖ్యే మహితశుభతరాషాఢ మాసీయదర్శే
వారేభూమీసుతస్య స్ఫురితమహతిథౌ శ్రేపునర్వస్వభిఖ్యే॥
శ్రీమద్ధారీతవంశామృత జలధివిధోఃరాఘవాచార్యస్యపత్నీ
శేషామ్బాపుత్రరత్నం భువనగురువరం సాధుసూతేస్మ దివ్యమ్॥

కారంబేడు గ్రామనివాసధన్య
శ్రీరఙ్గసూరీన్ద్రతనూభవస్య ॥
శ్రీ రాఘవాచార్యగురోస్తనూజః
రఙ్గార్యసూరిస్సమభూద్గురుర్నః ॥

1942 వ విక్రమార్కశకాబ్దము 1807 శాలివాహన శకాబ్దము 1884 క్రైస్తాబ్దము ప్రభనాదిగతాబ్దములు 17 వీనికి సరియగు శ్రీ తారణనామసంవత్సర ఆషాఢబహుళ అమావాస్యభౌమవారసహిత పునర్వసునక్షత్రమునందు పాలసముద్రమునకౌస్తుభమణివలె శ్రీ శీక్షాంబాగర్భమున జగదానంద సందోహరూపము దుర్మతతిమిరభాస్కరము సకలపూర్వాచార్యసమూహాత్మకము శ్రీహయగ్రీవతేజస్స్వరూపము దేహమునుదాల్చిన సకల సచ్ఛాస్త్రసారమనునటుల నుద్భవించిన శిశురత్నమిపుడు జగదాచార్యపదము నలంకరించియున్నది.

ఇట్టి సత్సంతానసంపత్తిచే సంతుష్టాంతరంగులగు శ్రీ రాఘవాచార్యస్వామివారి శిశురత్నమును వీక్షించుటకై విచ్చేసిన మహాపురుషులందఱు * తేజస్వీ యశస్వీ బ్రహ్మవర్చసీ భూయాః * ఇత్యాదిరీతిగ ఆశీర్వదించిరి. శ్రీ వేంకటనాథదేశికమణిమాడ్కి శ్లో॥ ప్రతిష్ఠాపితవేదాన్తః ప్రతిక్షిప్తబహిర్మతః॥ భూయాస్త్రైవిద్యమాన్యస్త్వం భూరికల్యాణభాజనమ్॥ ఇత్యాది మంగళాశాసనములు ఆయాకాలములందు మహామతులచే చేయబడినవి. కాకయు ఈదివ్యశిశువు యొక్క మాతామహులైన (తల్లికితండ్రి) శ్రీమాన్ ఆచార్ల

రాఘవాచార్యవర్యులు జననకాలగ్రహ సంపత్త్యతిశయమును చక్కగ విమర్శించి పరమానందభరితులై "ఈ శుభశిశువు విలక్షణజ్ఞానసంపన్నిధియు త్రిజగద్విఖ్యాత విమలకీర్తియుతుడును అభిరామగుణాకరుడును రాజాధిరాజ మకుటఖచిత రత్నావళీ తేజఃపుంజనీరాజితపాదాంబుజుడునై ప్రకాశింపగలద"ని సంతసముతో నుడివిరి. వీరిసార్థకవచనముల నిపుడు అనుభవించుచున్న మేము సయితము అనేకసంవత్సరములు సంతోషింపగలము.

మహారాష్ట్రదేశీయుడగు నొక జ్యౌతిషికాగ్రేసరుడు తనంతటతానచటికివిచ్చేసి ఈదివ్యశిశువుయొక్క జన్మపత్రికను పరిశీలించి చెప్పిన భవిష్యద్భాగ్యవిశేషములన్నియు శ్రీస్వాములవారియందిపుడును బ్రకాశిండుచున్నవి.

శుభనామకరణము.

ఇటుల ప్రబలపూర్వభవ్యభాగ్యనిధిగ నవతరించిన ఈదివ్యశిశువునకు "ఏకాదశేఽహని పితా నామకుర్యాత్" అను శాస్త్రరీతిగ వీరి తండ్రిగారు యథావిధిగ జాతకర్మనాచరించి తమతండ్రిగారినామధేయమును ఇడిరి. అందువలన నీ శిశువునకు రఙ్గనాథార్యులనియు, కులక్రమాగతమంగళార్తి వ్యవహారమును ఏర్పడి ద్వితీయరంగాచార్యులనియు ప్రసిద్ధిగల్గెను. బరపురసంస్థానాధీశ్వరులకులగురువులును అభినవనిగమాన్తదేశికులని ప్రసిద్ధిగాంచినవారును తత్వమార్తాండాది తొంబదియాఱుగ్రంథములను రచియించినవారునగు శ్రీమత్తిరుమలై బుక్కపట్టణం శ్రీనివాసమహాదేశికులసంతతిలో

అవతరించినవారును ఆత్మకూరు సంస్థానమున, ఆస్థానవిద్వాంసులునగు ఆచార్ల రాఘవాచార్యులవారును వీరి యన్నగారైన వనపర్తి సంస్థానపండితులైన ఆచార్ల వెంకటాచార్యులవారును ఈ శిశువునకు మాతామహులును నామకరణ మహోత్సవమునకరుగుదెంచి దౌహిత్రుని చల్లనికటాక్షములచే వీక్షించి * స్యాదసా॥ ఇత్యాదిగ నాశీర్వదించిరి.

ఆత్మకూరు సంస్థానప్రాప్తి.

ఆత్మకూరుసంస్థానాధీశ్వరులగు సవైరాజాముక్కడ శ్రీ సీతారామభూపాలరావ్ బల్వంతు బహద్దర్ ప్రభువులకు ప్రేమాస్పదభూతులును ఆస్థానపండితులునగు ఆచార్ల రాఘవాచార్యులవారు తమ ప్రభువుయొక్కమనోరథమును పూర్తిచేయదలంచి తనయల్లుడైన ఆసూరి రాఘవాచార్యులను కుటుంబసమేతముగ తన గృహమున స్థిరనివాసమునకై ప్రార్థించిరి. ఈ రాఘవాచార్యులును తన కుమారునియొక్క ఉన్నతోన్నతాభివృద్ధినిగోరి హయగ్రీవాదివాజ్ఞను పరమానుగ్రహమనితలంచి, కుమారాదిపోష్యవర్గసమన్వితులై కులారాధ్యదేవతయగు శ్రీనృసింహమూర్తిని సహ వేంచేపు జేసికొని ఆత్మకూరుసంస్థానమునందు మామగారి తిరుమాళిగలో నివసించిరి. శిశుపోషణకై కావలసినపదార్థములన్నియు రాజసంస్థానమునుండియే లభించుచుండెను. అన్నప్రాశనాదికార్యసనోపనయనాదులన్నియు ప్రాప్తకాలములందు యథావిధిగ జరుపబడినవి. బాల్యావస్థయందే గ్రహణధారణపటువై ప్రజ్ఞామేధాప్రతిభాతిశయములచే ప్రవర్ధమానుడగు మనస్వామి మాతా

శ్రీమంత్ ముక్కర సవైరాజా శ్రీ సీతారామభూపాలః
బల్వంతబహద్దరిత్యాది బిరుదభూషితః.
అమరచింత (ఆత్మకూరు) సంస్థానాధీశ్వరః.

G. Gopala Chary,
L.M.E.
MAHABUBNAGAR (A.P.)

శ్రీమంత్ ముక్క-ర సవై రాజా శ్రీరామ భూపాలః
బల్వంతబహద్దరిత్యాది బిరుదభూషితః
అమరచింత (అత్మకూరు) సంస్థానాధీశ్వరః.

మహనీయనన్నిధియందే కావ్యనాటకాలంకారాదిసాహిత్య గ్రంథములను అభ్యసించి సకలసజ్జనులను ఆశ్చర్యపఱచుచు 12 సంవత్సరములవయస్సునందే సాహితీసాగరపారంగతులనియు, బహువిధనిఘంటుగ్రంథాభిజ్ఞులనియు వ్యాకరణ శాస్త్రమర్మజ్ఞులనియు ప్రసిద్ధిగాంచిరి.

శ్రీ స్వామివారికి గృహస్థాశ్రమ ప్రాప్తి.

ఆత్మగూరు సంస్థానాధీశ్వరులకు ఇలువేల్పైన కురుమూర్తి శ్రీనివాసస్వామిసాన్నిధ్యముచే విలసిల్లు నాగపర్వతపుప్రాంతమున అమ్మాపురంబను నాగవిలక్షణ మహాపురుషాధిష్ఠితాగ్రహారముగలదు. అందు నేంచేసియుండు శ్రీమాన్ ఈచ్చంపాడి వెంకటాచార్యస్వామివారు మన స్వాముల దేహతేజస్సంపత్తిని ఆత్మగుణసమృద్ధిని నానావిధ భాగ్యసంపదలను శ్రవణానందముగవిని నయనానందముగ జూచి వీరిని అల్లునిగజేసికొనదలంచి ఆచార్యరాఘవాచార్యుల వారి గృహమునకరుగుదెంచి "ఆచార్యవర్యా! కులరూప వయోవిద్యాదులచే దేజరిల్లెడి దేవరవారిదౌహిత్రుడు నాకు జామాతయగునటుల ననుగ్రహింపుడు" అని ప్రార్థించిరి. ఆ రాఘవాచార్యులును భగవదనుగ్రహమును మున్నిడుకొని అనురూపసంబంధమగుటచే వారిప్రార్థనను అంగీకరించిరి. మాతామహులనియమనానుసారము మనస్వామి ఈచ్చంబాడి వెంకటాచార్యులవారి కన్యారత్నమైన శేషమ్మను వివాహమాడి, బ్రహ్మచర్యాదిసకలాశ్రమములకు ఉపకారకంబగు గృహస్థాశ్రమమును దుర్ముఖిసంవత్సరారంభమునసే స్వీకరిం

చిరి. అటుతరువాత సమీపకాలమునసే జనకులు శ్రీవైకుంఠము నలంకరించిరి. వీరికి మనస్వామి చరమ కైంకర్యములనన్నిటిని అతిశ్రద్ధతో శాస్త్రోక్తముగపూర్తిగావించిరి. ఇదంతయు 13 సంవత్సరములువయస్సు పూర్తిగాకముసుపే జరిగినది. ఆత్మకూరుసంస్థానమునందే తరువాత రెండుమూడు సంవత్సరములు స్వామివారు విద్యాభ్యాసనిరతులై నివసించియుండిరి.

శ్రీ స్వామివారికి ఉత్తమశాస్త్రాభ్యాసము.

పెద్దమేనమామగారైన ఆచార్ల వెంకటాచార్యుల వారి పెద్దకుమారులగు రంగాచార్యులు తర్క-వ్యాకరణశాస్త్ర పారంగతులై వనపర్తి సంస్థానమునసుండిరి. వీరి సన్నిధియందును, వీరితమ్ములగు రాఘవాచార్యులసమీపమునను అతిశ్రద్ధతో నొక సంవత్సరకాలముండి వ్యాకరణశాస్త్రము నభ్యసించిరి. తరువాత నచ్చోట కొన్ని విద్యాభ్యాసవిఘ్నములుగలుగగా న్యాయశాస్త్రాభ్యాస ఋతూహలులై మన స్వామి వనపర్తిసంస్థానమునువదలి 17వ వయస్సునందు విద్వద్వరవిహారస్థలంబగు మహీశూరపురంబును (మైసూరును) అలంకరించిరి.

ఆసమయంబున మైసూరిలో శ్రీ లక్ష్మీహయగ్రీవా స్థానమునవేంచేసియుండి శ్రీ బ్రహ్మతంత్ర స్వతంత్రపరకాలమఠ నిర్మాణమునున్నగువానిచే నతి ప్రసిద్ధులుగానుండిన శ్రీమత్పర మహంసేత్యాది శ్రీకృష్ణ బ్రహ్మతంత్రపరకాలమహాదేశికుని ఆశ్రయించి ఆమఠమునసే వేంచేసియుండిరి. ఆత్మకూరిలో



आस्थानधर्माधिकारि - तर्कतीर्थ - पण्डितरत्नम्
कस्तूरि रङ्गाचार्य स्वामिपादाः
(वैकुण्ठवासिनः)

మంచి మైసూరికి వేంచేసిరిగాన మనస్వామికి 'ఆత్మకూరు రంగాచార్యస్వామి'యని తిరునామము ప్రసిద్ధమయినది.

అప్పుడు మనస్వామి ఆశ్రీకృష్ణమహాదేశికుని సన్నిధిలో నాశ్రయింపవలయునని తలంచి వారిని ప్రార్థింపంగా వారును పరమకృపతో శంఖచక్రాంకనముచేసి కొన్ని మంత్రవిశేషములను ఉపదేశించి 'అబ్బా! శ్రీలక్ష్మీహయగ్రీవుని కృపాకటాక్షము నీయందు పరిపూర్ణముగనున్నది. చూడుము.'అని విశిష్య అనుగ్రహించిరి.

అపుడు మైసూరు సంస్కృతపాఠశాలలోచేరి చదువు సౌకర్యము త్వరలోదొరకనిచే వ్యాకరణం తాతాచార్య స్వామియని సుప్రసిద్ధులయిన మహనీయులయొద్ద కొన్ని మాసములు వ్యాకరణగ్రంథములనే చదువవలసివచ్చెను. ఇంతలో సంస్కృతపాఠశాలలో చదువనధికారులయనుమతి లభించెనుగాన పాఠశాలలోచేరి న్యాయశాస్త్రప్రకరణగ్రంథములు చదువ నారంభించిరి. అప్పుడు, విద్వాన్ నామగుండం శ్యామాచార్యులను వారు ప్రకరణగ్రంథపాఠమునకు ఉపాధ్యాయులుగానుండిరి. వారు మనస్వామియొక్క విలక్షణమయినబుద్ధివిలాసమును నిరుపమప్రతిభావిశేషమును విషయములను ఉపపాదించు సామర్థ్యమును చూచి యత్యాశ్చర్యపడి విశేషించి ప్రవచనముచేయగా వీరతి శీఘ్రముననే ప్రకరణాంతపాఠమును ముగించి వాదగ్రంథముల నభ్యసించుటకై విశేషాధికారులను అన్వేషింపసాగిరి.

శ్రీమత్కస్తూరిస్వామి సన్నిధిలో శాస్త్రాభ్యాసము.

శ్రీమత్కస్తూరి రంగాచార్యస్వామి తిరునామము నెఱుగనివారీ భూమండలమునసే ఉండరు. ఈ మహాసీయులు తర్క-తీర్థన్యాయరత్నాద్యనేకబిరుదముల నొందినవారు. చతుశ్శాస్త్రములలోను, విశిష్ట న్యాయవేదాంతములలోను మహాపండితులు. వీరు శ్రీలక్ష్మీహయగ్రీవాస్థానమున 30వ పట్టమునవేంచేసియుండిన రీమాస్వామియని ప్రసిద్ధులయిన శ్రీమత్పరమహంసేత్యాది శ్రీరఙ్గనాథ బ్రహ్మతన్త్ర పరకాలమహాదేశికునిసన్నిధిలో న్యాయవేదాంతముల నధికరించి ఉత్తరభారతమునను ప్రసిద్ధులై మైసూరు సంస్కృత పాఠశాలలో తర్క-వేదాంత ప్రధానోపాధ్యాయులై యుండిరి. వీరియొద్ద శాస్త్రములనధికరించి ప్రఖ్యాతులయిన మహా విద్వాంసులును, వారి శిష్యులును ఇప్పటికికూడగలరు. ఈ స్వామి స్వల్పకాలము మైసూరు సమస్థాన ధర్మాధికారి పదవిలోకూడ ఉండిరి.

ఆ మహనీయులసన్నిధిలో మనస్వామి ప్రౌఢవాద గ్రంథములనధికరింప నారంభించి * ఏకోయమేవ మమ శిష్య గణేషు ముఖ్యః * అని యాస్వామియే కొనియాడ దగిన మహా బుద్ధిమంతులై, వాదగ్రంథములను క్రోడపత్రములను చదువుచుండగా ఈవిభూతియొక్క దౌర్భాగ్యముచేత నా కస్తూరి స్వామి రవ వయస్సునసే పరమపదించిరి. మనస్వామి యాచార్యవిశ్లేషమునకు చాలదుఃఖపడి కాలక్రమమున తేఱి మిగిలిన గ్రంథభాగములను తమబుద్ధివిశేషముచే తనన్వయించు

కొని పాఠప్రవచనముమున్నగు వానిచేత శాస్త్రములను వృద్ధి యొయించుకొనుచుండిరి. సామాన్యశాస్త్రములను చదువు సమయమే శ్రీభాష్యముమున్నగు అధ్యాత్మగ్రంథ కాలక్షేపము చేసిరి.

విద్వత్పరీక్షోత్తీర్ణతయు, ఆత్మకూరువాసమును.

ప్లవంగనామసంవత్సరమున (A. D. 1908) శ్రీమన్మహారాజ సంస్కృతపాఠశాలలో జరుగు శ్రావణమాసీయ విద్వత్పరీక్షలో ప్రథమశిక్ష్యలో కృతార్థులై రాజాస్థానమున శ్రీమత్కణ్ఠీరవ నరసింహనాధీశ్వరునిచే ఉత్తమోత్తమముగ బహుమానముచేయబడిరి.

ఆకాలమున మనస్వామియొక్క-తల్లిగారు ఆత్మకూరిలో అస్వస్థముగనుండుటనెఱింగి యచటికి వేంచేయగా తత్సంస్థాన ప్రభువయిన నలై రాజాముక్కర శ్రీరామభూపాలబన్ధు బహద్దరు ప్రార్థనానుసారము అచట రెండుసంవత్సరములు వేంచేసియుండిరి.

తిరిగి మైసూరికివేంచేయుట.

ఇంతలోతల్లియు దేహారోగ్యమునొందగ, తిరిగిమైసూరికి వేంచేసి పాఠశాలలోచేరి, తిరుమాళిగలోను సామాన్య విశేషశాస్త్ర ప్రవచనములుచేయుచు విశిష్ట భగవద్రామానుజసిద్ధాన్తగ్రంథప్రవచనపరులై సదనుష్ఠానసంపన్నులై వేంచేసియుండిరి.

స్వామియొక్క గృహస్థాశ్రమ ధర్మపరిపాలనప్రకారము పరమవిలక్షణముగనుండునని అపుడు వారితోకూడనుండి యనుభవించిన మహానీయులు సాయించుచున్నారు. తమ కులారాధ్యులయిన శ్రీ నరసింహునికిని, తాము వేంచేపించిన శ్రీ లక్ష్మీహయగ్రీవునకును ప్రతిదినము రెండుమూడుపర్యాయములు నమ్రనామార్చనలు జరుపుట మొదలయిన అతిశయములు వివరించిన మహాభారతమగును.

పరీధావిసంవత్సర (1912) శ్రావణమాసీయ పరీక్షలో విశిష్టాద్వైత వేదాంతభాగమున పూర్వమువలె ఉత్తమ కక్ష్యలో తేఱి దానికేర్పడిన బహుమానములనుపొందిరి. అప్పుడు పాఠశాలలో ప్రధానాధ్యక్ష (Principal) పదవిలో నుండిన 'ఆకాశపురాణం' ఇక్స్లెక్చరు రంగాచార్యస్వాములు మనస్వామియొక్క పాండిత్యప్రభావమునుచూచి వీరిచేతనే యీపాఠశాలమహాభివృద్ధినొందవలయునని తలంచి స్వామిని ఉపాధ్యాయపదవిలో నియమించిరి.

అపుడు పాఠశాలలో ప్రాచీన న్యాయప్రవచన మేర్పడలేదు. అయినను దానినపేక్షించిన విద్యార్థులకు దానిని ప్రవచనముచేయుచుండిన మనస్వామి పాఠశాలలోనిదియు నియమేన ఉండవలయును అను నిబంధన ఏర్పడుటకును మూలకారణమైరి.

మఱియు, కావ్యప్రకాశముమొదలైన అలఙ్కారగ్రంథ ప్రవచనముచేయుచు న్యాయశాస్త్ర ప్రధానోపాధ్యాయస్థానమున నియమింపబడిరి.

శిష్యసమృద్ధి.

మనస్వామినన్నిధిలో ప్రాచీననవీనన్యాయశాస్త్రములను కావ్యప్రకాశాదిగ్రన్థములను అభ్యసించిన శిష్యులు సర్వకలాశాలా (University) పరీక్షలలోతేఱి అచ్చటచ్చట పాఠశాలలలో శాస్త్రప్రవచనముచేయుచున్నారు. అట్లు పలువురుండినను స్వామిబావమరదులగు పుసులూరు జేమాచార్యస్వామియు, వారితమ్ముడయిన ఆత్కూరు దీక్షాచార్యస్వామియు బాల్యము మొదలు మనస్వామిచేతనే శిక్షింపబడి ఆచార్యవిషయక ప్రేమభక్తులతోనుండుట లోకప్రసిద్ధము.

విజయయాత్రావిశేషములు.

మైసూరు సంస్థానములతోపాటు గద్వాల వనపర్తి ఆత్కూరు మున్నగు సంస్థానములలో అప్పుడప్పుడు జరుగు విద్వత్సదస్సులకును ఆహూతులై విచ్చేసి విశేషముగ వాక్యార్థములుచేసి అనేకప్రభువరులచేత సత్కరింపబడిన ప్రభావముల పరిమితములు. అకాలమున రీమూసంస్థాన మహారాజుగారు శాస్త్రమేర్పఱచిన విద్వత్సభకు అనేకదేశములనుండి విద్వాంసులను రప్పింపదలంచి అందఱికిను ఆహ్వానపత్రికలనంపిరి. అపుడు మైసూరు సంస్థానమునుండియు విద్వాంసులను రప్పింపదలంచి, ఆకాలమున శ్రీ లక్ష్మీహయగ్రీవాస్థానమున వేంచేసియుండిన శ్రీమత్పరమహంసేత్యాది. శ్రీ వాగీశబ్రహ్మతంత్ర పరకాలమహాదేశికులసన్నిధికి విజ్ఞాపనపత్రిక నంపునపుడు 'ఇతరమతములను ఖండించి మన సిద్ధాంతమును స్థాపింపగలవిద్వాంసులుండిన నంపవలయున'ని విశిష్య ప్రార్థించిరి.

ఆ వాగీశస్వామియు అట్టి విద్వన్మణి మనస్వామియేయని నిశ్చయించి వీరిని నియమించిరి. మనస్వామియు ఆచార్యనియమనము అనుల్లంఘనీయముగాన నానియమనమును శిరసావహించి బయలుదేఱి బంబాయికివిచ్చేసి, అప్పుడు రీమానుండి బంబాయికివచ్చియుండిన రీమాప్రభువునుచూడగా, అతి మేధావియయిన యాప్రభువును మన సిద్ధాంతముమీద నితరులుచెప్పు పూర్వపక్షములను తెలిపి వీరిని సమాధానముల నడుగగా, వీరును శ్రుతప్రకాశికా శతదూషణీ సర్వార్థసిద్ధి మున్నగు సకల గ్రంథములునుపస్థితముగా నుండుటచే ఆపూర్వపక్షములకు పలువిధంబులుగ సమాధానములను సాయించిరి. ఆ రాజును పరమానందభరితుడై వీరిని విశేషముగ సత్కరించి గౌరవించెను.

పిమ్మట నచటనుండి బదరికాశ్రమయాత్రచేయ నిచ్చగించినను వెంటనే రావలయునని శ్రీ శ్రీస్వామినియమనమగుటచే అచటనుండియే మైసూరికి తిరుగవలసివచ్చెను.

సంతతి.

* ఆచార్యాయ ప్రియం ధనమాహృత్య ప్రజాతంతుం మావ్యవచ్ఛేత్సీః * అను ఔపనిషదోపదేశప్రకారము స్వామికి కుమారులిద్దఱు. వీరికి యథాకాలమున శాస్త్రప్రకారముపనయనాది సంస్కారములనుచేసి వైదిక విద్యాభ్యాసమునేచేయించిరి. వీరిలో జ్యేష్ఠులు సలక్షణ ఘనాన్త వేదాధ్యయనప్రవీణులై న్యాయనేదాంతములయందును వేదభాష్యమునను పరీక్షలిచ్చి ఉత్తీర్ణులై ఇపుడు మైసూరు మహా

రాజు సంస్కృతపాఠశాలలో వేదాధ్యాపకులై యున్నారు. రెండవకుమారులును క్రమాంతాధ్యయనముచేసి సాత్వికవృత్తిగనున్నారు.

శ్రీస్వామియొక్క ఉపాయానుష్ఠానము.

సేతుయాత్రజేసి దక్షిణదివ్యదేశములను మంగళాశాసనముచేయవలయునని తలంచిన మనస్వామి (1916) రాక్షసనామ సంవత్సరమున బయలుదేఱి మార్గక్రమమున తిరువళ్ళూరు శ్రీ వీరరాఘవులు, కంచి తేవప్పెరుమాళ్ళు, తూప్పులు నిగమాంతమహాదేశికులు, తిరువహీంద్రపురము దేవనాథులు, తిరుక్కుడందై ఆరావముదులు మున్నగు పెరుమాళ్ళను మంగళాశాసనముచేసుకొని శ్రీరంగమునకు వేంచేసి అచ్చట * ఆపాదచూడమనుభూయ హరిం శయానం మధ్యేక వేరదుహితుర్ముదితాంతరాత్మా । అద్రష్టృతాం నయన యోర్విషయాంతరాణాం యోనిశ్చికాయ * అనునట్లయి * ఎన్నముదనైక్కండకణ్గళ్ మఱ్ఱొన్ఱినైక్కాణావే* అనురీతిగ ననుభవించుచుండగా ఉపాయానుష్ఠానము చేసుకొని కృతకృత్యులు కావలయునని మనోరథించి, స్వనిష్ఠాప్రపదనము నేయనుష్ఠించు సామర్థ్యముండినను * నబుద్ధిభేదం జనయేత్ * అను గీతాచార్యశ్రీసూక్తి ననుసరించి అప్పుడచ్చట వేంచేసియుండిన జ్ఞానానుష్ఠానసంపన్నులయిన శ్రీమత్పరమహంసేత్యాది డెంగణికోటై వరదరామానుజ మహాదేశికులసన్నిధిలో నాశ్రయించి వారిద్వారా శ్రీరంగనాథుల తిరువడిలోనె భరన్యాసముచేసుకొనిరి.

పిమ్మట అచటినుండ సేతువునకు వేంచేయవలయునని తలంచినను కార్యవశముచేత మైసూరికేతిరిగి యథాపూర్వము వేంచేసిరి.

ఆత్మకూరు రంగాచార్యస్వామియని ప్రసిద్ధులయిన మనస్వామి పూర్వాశ్రమ చరిత్రము సంపూర్ణము.

శ్లో॥ అథాస్మత్స్వామిపాదానాం తుర్యాశ్రమనిషేవణే।
ప్రస్తావనాత్మికాచర్యా సంగ్రహేణ నిరూప్యతే॥

శ్రీ వాగీశస్వామి పరమపదించుట.

శ్రీమన్మహీశూర కర్ణాటసింహాసనాధీశ్వర శ్రీమదాజాధిరాజేత్యాద్యనన్యసామాన్య బిరుదావళీపరిష్కృతులయిన శ్రీమద్రాజాధిరాజ శ్రీమన్నాల్వడి కృష్ణరాజేంద్ర ప్రార్థనచేత ప్రకృతసంస్థానరాజసంతతికి చక్రాంకనము సదుపదేశము ప్రసత్త్వనుష్ఠానమున్నగువానిని చేయుచు, సదర్థసామ్రాజ్యసమాకృతమైన రాజ్యపరిపాలనధూర్వహత్వముచేత రాజర్షులను ప్రసిద్ధిని చిరకాలమునుండి సంపాదింపచేయుచున్న శ్రీ బ్రహ్మతంత్రపరకాలమఠాధిపతులకుచేరిన శ్రీలక్ష్మీహయగ్రీవాస్థానమున 3-వ పట్టమున నభిషిక్తులయిన శ్రీశ్రీ వాగీశబ్రహ్మతంత్ర పరకాలమహాదేశికులు క్రోధనసంవత్సరము కన్యామాసమున దేహారోగ్యముచెడి పండుకొనిరి. అప్పుడు ౧౦ దినములు నోరుకూడ తెఱవకుండునంత అనారోగ్యమధికరించుటచే వైద్యులును చేవిడిచిరి. ఈ విషయము నెఱింగిన

మహారాజుగారు ఆయాస్థానమునకు దగినవారెవరని విచారించి మనస్వామియే తగినవారని నిశ్చయించిరి. అపుడు రాజాస్థానాధికారియొకరు మనస్వామినన్నిధికివచ్చి ప్రసంగవశముగ శ్రీవాగీశస్వామియొక్క- అనారోగ్యమును తెలిపి స్థానాభిషేకవిషయముగ మనస్వామిని యడుగగా, వీరును దాని కొడంబడకుండుటను తెలుసుకొని నిరుత్సాహులై తిరిగిరి. శ్రీ వాగీశస్వామియు అనారోగ్యమధికరించి స్వస్థానమున నెవరిని నియమింపకయే క్రోధన సం॥ ఆశ్వయుజ కృష్ణతృతీయరాత్రి పరమపదించిరి. ఈ విషయము నెఱింగిన మహారాజుగారు ప్రధానకార్యస్థులమూలముగ వారి చరమక్రియలను యథాక్రమముగజరిపిరి.

మహారాజుగారియొక్క వైయాలోచన.

పిమ్మట మహారాజుగారు 'ఇక మనకులదీపమగు నీయాచార్యపీఠమునలంకరించి శ్రీలక్ష్మీహయవదన లక్ష్మీనారాయణస్థానమున భగవదారాధనాదులను జరుపుచు ప్రతిదినము భగవత్తీర్థమును సమయవిశేషములయందు శ్రీపాదతీర్థమును అనుగ్రహించి సదుపదేశాదులచేత తమను ఉజ్జీవింపించి ఉభయవేదాంతరహస్యాది గ్రంథములను సచ్ఛిష్యులకు ప్రవచనముచేసి సిద్ధాంతస్థాపనముచేయుగల యొక మహామహిమసంపన్నులు ఈయాస్థానమున నభిషిక్తులుకావలయునే! అట్టి వ్యక్తివిశేషము అగపడలేదే!' అని విచారించి, మనస్వామి ప్రభావంబును ఆప్తజనమూలముగ చక్కగ నెఱింగినవారుగాన నతిప్రయాసముచేతనయినను ఈస్వామినే

ప్రార్థించి యొప్పజేసి సనాథముగ జేయవలయునని తీరుమానించి దానికితగినయుపాయములను జింతించుచుండిరి.

ఇదియిట్లుండగ, ఒకదినము వేకువజామునను మనస్వామిస్వప్నములో తనకు అధ్యాత్మశాస్త్రోపదేష్టలగు శ్రీశ్రీకృష్ణబ్రహ్మతంత్ర పరకాలమహాదేశికులును, శ్రీవాగీశబ్రహ్మతంత్ర పరకాల మహాదేశికులును సేవసాయించి మన స్వామిచేతిలో ఫలమంత్రాక్షతలనిచ్చి 'శ్రీలక్ష్మీహయగ్రీవుని కటాక్షము నీయందు పరిపక్వమైయున్నది' అని సాయించి యంతర్ధానమైరి. మనస్వామియు నిద్రలేచియూ స్వప్నవృత్తాంతంబున శ్రద్ధలేకయే నిత్యకర్మానుష్ఠాననిష్ణాతులై యుండిరి.

మహారాజుగారి కార్యదర్శిని స్వామికిని సంవాదము

మహారాజుగారు తమ యంతరంగకార్యదర్శియయిన శ్రీమాన్ S. P. రాజగోపాలాచార్యస్వామిలో తమ నిష్కృష్టాభిప్రాయంబును తెలిపి 'ఎటులయినను మనస్వామి నొప్పినట్లు చేయవలయున'ని నిర్బంధింపగా, వారును సంస్కృతకళాశాలాధ్యక్షులైయుండిన శ్రీమాన్ C. రామానుజయ్యంగార్లు మూలముగ మనస్వామిని తమ యింటికి రప్పించి మహారాజు మనోరథంబునుదెలిపి 'స్వామియేయవశ్యము దయచేయవలయున'ని ప్రార్థించిరి. దానికి స్వామి 'నేను మహాప్రభువుయొక్క యాస్థానంబుననుండి జ్ఞానసంపాదనము చేయుచున్నాడను. నేనొక సామాన్యవ్యక్తి. ఆస్థానమును నిర్వహింపగల శక్త్యాదులును నాకులేవు. అభిరుచియులేదు. తురీయాశ్రమధర్మపరిపాలనంబున ననేకకష్టములుగలవు. కనుక

సర్వోపకారకమంబగునీ యాశ్రమంబునన్ నేయుండి కాలమును గడపెద. మహారాజుగారిప్పుడు నాకిచ్చియుంచు స్థానంబున నేకొఱతయులేదు. ఈ స్థితిలోనే మహారాజుగారు నన్నుపెట్టియుండినజాలును' అని సాయించిరి.

దీనినివిన్న మహారాజుకార్యదర్శి 'స్వామీ! శ్రీవాగీశస్వామి పరమపదించుటకు పూర్వమే దేవరవారొప్పలే దనువిషయంబును మహారాజెఱుంగుదురు. ఈయాస్థానమున పూర్వము వేంచేసియుండినస్వాములశరీరసంబంధులలో జ్ఞానానుష్ఠానవైరాగ్యసంపన్నులనే నియమించుట వాడుకగనున్నది. స్వామికిగల జ్ఞానానుష్ఠానాదులలో నేకదేశమయిన నమాయించు వ్యక్తినంతరములభించిన స్వామిని నిర్బంధింపము. వీని సంతయునెఱింగియే మహారాజుగారు స్వామినేనియమింపవలయుననుదృఢాధ్యవసాయంబుతో నున్నారు. మహారాజులనుపేక్షించినను అనన్యగతియయిన శిష్యునుండలము నుపేక్షించుట యుచితముగాదు. స్వామియుపేక్షించిన మనదర్శనంబునకే మహాలోపమును గలుగజేసినవారగుదురు. ఆశ్రమధర్మములను జరిపించుటకుగల యనుపపత్తులనన్నిటిని పరిహరించి తగు సౌకర్యములనుకూడచేసి యిచ్చుటకు మహారాజుగారు సిద్ధముగనున్నారు.' అనిచెప్పి నిర్బంధింపగా, మనస్వామి తమ కిటీవలగలిగిన స్వప్నానుగ్రహవిశేషంబును స్మరించి 'శ్రీలక్ష్మీహయగ్రీవునియాజ్ఞయనివార్యముగనున్నది గాబోలు!' అని తలంచి * సంరక్షణీయమమరాధిపతే! త్వయైవ దూరంప్రయాతమపి దుస్త్యజగాఢబంధమ్ । ఆకల్పవాసిభవానను కంపమానః సూత్రానుబద్ధశకునిక్రమతః స్వయం మామ్ *

(దేవనాయకపఞ్చాశతి) అను దేశికశ్రీసూక్తిప్రకారము పరమప్రాప్యమయిన శ్రీలక్ష్మీహయగ్రీవదివ్యారాధన మహాకైంకర్యమునకు అనుమతిని సూచించిరి. దీని నెఱింగిన మహాప్రభువును మహానందభరితులై పైనజరుగవలసిన కార్య విశేషంబులకు ఉత్తరవుచేసిరి.

శ్రీ స్వామికి రాజమర్యాదలప్రాప్తి.

మఱుదినమున మహారాజుగారు ఉచితమర్యాదలతో శ్రీస్వామితిరుమాళిగకు రాజగృహంబునుండి ఆందోళికనంపి స్వామినివేంచేపించి సాష్టాంగంబుగ దండమునసమర్పించి ధన్యవాదములను విజ్ఞాపించి తమపరమసంతోషాతిశయంబును తెలిపి * ప్రత్యక్షే గురవః స్తుత్యాః * అనురీతిగ బహుప్రకారంబుగనుతించి బద్ధాంజలిపుటులై 'స్వామియివుడే సన్యాసివలెనుండునట్లు వినబడియుంటిని. కనుక స్వామియాచార్యపీఠమునలంకరింపవలయున'ని ప్రార్థించిరి. అద్దానికి మనస్వామి 'పర్వతాగ్రంబు నెక్కదలంచినవాడు మొదటి రెండుమూడు గట్టులలోనేయుండునట్లు నేను ఆతురీయాశ్రమంబును స్వీకరించుటకు అనర్హుడైయుండెద. అయినను శ్రీలక్ష్మీహయగ్రీవుని యనుగ్రహంబుచేతను ఆచార్యుల విశేషకటాక్షంబుచేతను ఆశ్రమధర్మంబులను యథాశక్తి జరిపెద'నను మొదలయిన అమృతధారావర్షమును వర్షించిరి. పిమ్మట మహారాజుగారు ప్రతిష్టావస్త్రసమర్పణాది సత్కారములనుజేసి * ఆద్వారమనువవ్రాజ * అనురీతిగ మంగళాశాసనముతో రాజద్వారమువఱకు బద్ధాఞ్జలిపుటులై అనుసరించిరి. పిమ్మట శ్రీ

శ్రీమత్పరమహంసేత్యాది.
శ్రీ లక్ష్మీహయగ్రీవ దివ్యపాదుకాసేవక
శ్రీమదభినవరంగనాథ బ్రహ్మతన్త్రపరకాల
మహాదేశికస్వాములవారు.

స్వామియు రాజమర్యాదలతో తిరుమాళిగకు వేంచేసిరి. అపుడే పూర్వాశ్రమసంబంధమయిన లౌకిక వ్యాపారవిశేషములను చేసివేసిరి.

శ్రీస్వామితురీయాశ్రమమును స్వీకరించుట.

శ్లో॥ శ్రీమత్రోఽధనవత్సరే శుభతరేమాస్యాశ్వినే శ్యామలే
పక్షే నావమికేతిథౌ సమభజత్తుర్యాశ్రమం పావనమ్ ।
యస్తం దివ్యగుణాకరం హ్యభినవ శ్రీరంగనాథాభిధం
లక్ష్మీవాజిముఖావతారమపరం యోగీశ్వరం భావయే॥

మఱుదినము ప్రాతఃకాలమున ప్రాతరాహ్నికంబులను యథాక్రమంబుగ ముగించినపిమ్మట, పాఠశాలాధ్యక్షులయిన శ్రీమాన్ సి. రామానుజయ్యంగార్లతో కావేరికి వేంచేసి స్నానముచేసి, ఉత్తరతీరముననుండు శ్రీసన్నిధిశాఖామఠమగు కొప్పలు మఠమునకు వేంచేసి అచట శ్రీసన్నిధి యాస్థానమున శ్రీవ పట్టమున మూర్ధాభిషిక్తులైయుండిన శ్రీశ్రీనివాసబ్రహ్మతంత్ర పరకాల మహాదేశికుల బృందావనమును సేవించి యచటి నుండి శ్రీసన్నిధికి వేంచేసిరి. ఆశ్వయుజకృష్ణనవమియగు మఱుదినమున జరుగవలసిన ఆశ్రమ స్వీకారమునకై పూర్వదిన కర్తవ్యంబులన్నియు యథాశాస్త్రంబుగ ననుష్ఠింపబడెను. మఱునాడయిన నవమిదినమున శ్రీలక్ష్మీహయగ్రీవుల సన్నిధిలో ప్రేషమంత్రోచ్చారణ పూర్వకముగ తురీయాశ్రమమును స్వీకరించిరి. అపుడు రాజాధికారులును ఆస్థాన ధర్మాధికారులును అనేకవిద్వాంసులును ఇక ననేక మహనీయులునువచ్చి శ్రీస్వామి యనుగ్రహమునుపొంది కృతార్థులయిరి.

శ్రీ స్వామియొక్క మూర్ధాభిషేకమహోత్సవము.

శ్రీమన్మహాశూర సంస్థానాధీశ్వరులైయుండిన నాల్వడి కృష్ణరాజవుడైయార్ల యొక్క ఆజ్ఞానుసారముగ శ్రీలక్ష్మీహయగ్రీవ లక్ష్మీనారాయణాస్థానమున శ్రీమద్వేదమార్గ..... శ్రీమత్పరమహంసేత్యాది బిరుదావళీ భూషితులయిన మన స్వామికి క్రోధనాశ్వయుజకృష్ణత్రయోదశి గురువారమునాడు (15-10-25)మూర్ధాభిషేకమహోత్సవము జరిగెను. తత్పూర్వాంగంబుగ మఠము పరమవిలక్షణ రమణీయాలంకారశత సహస్రోపశోభితమైయుండెను.

ముహూర్తకాలము సన్నిహితముకాగా, సకలాధికారివర్గమును విద్వద్వరేణ్యులును నగరమహాజనులును మహోత్సవమును సేవించుటకై శ్రీసన్నిధిమధ్యమంటపంబున గుమికూడియుండిరి. శ్రీ స్వామియు పాతరాహ్నకంబులనుముగించుకొని శ్రీ లక్ష్మీహయగ్రీవ లక్ష్మీనారాయణుల కభిగమనారాధనము సమర్పించి, కోటకులోబడిన శ్రీకృష్ణునిసన్నిధినుండి వాడుకప్రకారము తెచ్చిన సహస్రధారాతట్లలో శ్రీ లక్ష్మీహయగ్రీవులను వేంచేపించి శ్రీ హయగ్రీవుల సన్నిధికి కుడిపక్కనమధ్యాంగణమున ప్రాఙ్ముఖముగ సిద్ధము చేసిన కృష్ణాజినముతోగూడిన రజతపీఠమున * కాషాయశోభి కమనీయశిఖానివేశం దండత్రయోజ్జ్వలకరం విమలోపవీతం। ఉద్యద్దినేశనిభం ఉల్లసదూర్ధ్వపుండ్రం రూపం తవాస్తు యతిరాజ దృశోర్మమాగ్రే* అనురీతిగ శ్రీస్వామి వేంచేసియుండిరి. వివిధమంగళ వాద్యఘోషములు సముద్రఘోషమువలె ప్రాకుచుండెను. మహారాజుగారు నా సమయమున వైదిక వేషములతోవచ్చి, శ్రీసన్నిధిసర్వాధికారులచే యథా సముదాచారము గావింపబడి శ్రీ సన్నిధి పురోభాగమున పచ్చినిల్చి * అద్య మే సఫలం జన్మ సుప్రభాతా చ మేనిశా* ఇత్యాద్యనుసంధానములతో శ్రీ లక్ష్మీహయగ్రీవులకు సాష్టాంగముగ దండమునుసమర్పించి, శ్రీ స్వామివేంచేసియుండు పీఠ సమీపమునకేగి శ్రీ స్వామిని దండమునుసమర్పించి పట్టాభిషేకమునకై వేంచేయవలయునని సాంజలిబంధుడై ప్రార్థింపగా, శ్రీ స్వామియు దానికై కల్పితమయిన ఆసనమునవేంచేసిరి. మహారాజుగారును పట్టాభిషేకాసనసమీపమున ఉత్తరముఖముగనిల్చియుండిరి. అప్పుడు శ్రీ లక్ష్మీహయగ్రీవులను వేంచేపించియుండిన సహస్రధారాతట్లను ఇద్దఱు శ్రీవైష్ణవులు శ్రీ స్వామిశిరస్సునకుపైన పట్టగా, శ్రీ సన్నిధి యారాధకులు సువర్ణకలశమున అభిమంత్రితతీర్థమును తెచ్చి పురుషసూక్తాద్యాపనిషదమంత్రపూర్వకముగ శ్రీ లక్ష్మీహయగ్రీవులకు ప్రోక్షణముచేసి తత్పాదతీర్థముచే శ్రీ స్వామికి అభిషేకముచేసిరి. ఆ సమయమున మహారాజుగారి మూలముగ శ్రీస్వామికి జరుగవలసినమర్యాదలన్నియు యథాక్రమముగజరిగెను. పిమ్మట తిరునారాయణపురము మున్నగు దివ్యదేశములనుండివచ్చిన తిరుప్పరివట్టము తులసి మాలమర్యాదలనుస్వీకరించి ఆసనమునవేంచేసి మహారాజుగారిని కూర్చుండనియమించిరి. పిమ్మట రాజకీయాధికారులందఱు యథాక్రమంబుగకూర్చుండిరి. అప్పుడు హితమయినవచనములను కొన్నింటిని సాయింపవలయునను రాజుగారి ప్రార్థనముననుసరించి

హితోపదేశరూపములగు కొన్ని శ్రీసూక్తులను పరమకృపతో సాయించిరి. అప్పడచ్చట సన్నిహితులైయుండిన శ్రీమాన్ రాళ్ళపల్లి అనంత కృష్ణమాచార్యులను విద్వాంసులు అతి మధురమయిన రెండుతనియన్ శ్లోకములనుచదివి సదస్సును సంతోషింపజేసిరి. అదిమొదలు 'శ్రీలక్ష్మీహయగ్రీవ దివ్య పాదుకాసేవక శ్రీమదభినవవరద్వనాథ బ్రహ్మతంత్రపరకాల మహాదేశికుల'ను తిరునామము శ్రీస్వామికి ప్రసిద్ధమయ్యెను. శ్రీస్వామికి పూర్వాశ్రమమున మాతామహులును ఆచార్యులునైన ఆచార్ల రాఘవాచార్యస్వాములవారుకును వేదాన్తవిద్వాచార్యులైన శ్రీ కృష్ణబ్రహ్మతన్త్రి పరకాల మహాదేశికులకును ఆచార్యులునైన 30వ పట్టమున మూర్ధాభిషిక్తులైయండిన రీమాస్వామియని ప్రసిద్ధులయిన శ్రీరంగనాథ బ్రహ్మతంత్రపరకాలమహాదేశికులసన్నిధిలో శ్రీరంగనాథుల తిరువడియందు భరసమర్పణమైనందున శ్రీరంగనాథుల సన్నిధియందునను మనస్వామికిగల కృతజ్ఞతానుసంధాన పరమకాష్ఠ * తన్నామవహనంచైవ * అనురీతిగనమరెను.

పిమ్మట మహాప్రభువు స్వామిపట్టాభిషేకకాలమున సమర్పింపవలసిన ఆచార్యసంభావనాదులనుసమర్పించి, శ్రీస్వామిసన్నిధినుండియు బహుమానములను పూర్ణఫల మంత్రాక్షతలను సవినయముగ స్వీకరించి స్వస్థానమునకుచేరెను. శ్రీ సన్నిధికి ఏర్పడినస్థిరచరాస్తులను తమ సంస్థానదేవాలయముల నగ్రమర్యాదలను ఇతర లౌకికవ్యవహారాదులను శ్రీ స్వామి తిరునామముచేతనే జరిపింపవలయునని రాజు శాసనము చేయగా అదిమొదలు అన్నియునటులే జరుగుచున్నవి.

మూర్ధాభిషేకమునకై వచ్చియుండిన రాజాధికారులును, ఆస్థానధర్మాధికారులును, విద్వాంసులును ఇతర మహాజనులును ఫలమంత్రాక్షతలను స్వీకరించి నిమమనముపొందిరి.

శ్రీ స్వామియొక్క నిత్యానుష్ఠానక్రమ వైభవము.

జ్ఞానానుష్ఠానములను రెంటిలోను నిస్సమాభ్యధికులైన మనస్వామియొక్క దినచర్యాక్రమము పరమ పిలక్షణమయినది. అతిశయోక్తి లవలేశమునులేకయే స్వభావోక్తి ప్రక్రియలోనే దినచర్యానుసన్ధానస్తోత్రము విజ్ఞాపింపబడియున్నది. శ్రీ సుదర్శనశతకమను సుప్రసిద్ధస్తోత్రమున ప్రతిశ్లోకంబునను ఒక్కొక్కఫలముచెప్పబడియున్నది. అందు 87వ శ్లోకమున *సదనజవిజయా హంతు తంద్రాలుతాం వః*అని చెప్పబడిన ఫలము మనస్వామియందే అమరియున్నదని నిశ్చయముగ చెప్పవచ్చును. అందఱకును సహజమయిన తంద్రను (సోమరితనమును) సర్వాత్మనాపరిహరించి స్వకీయనిత్యకర్మానుష్ఠానములను, భగవదారాధనములను, అధ్యాత్మశాస్త్రప్రవచనప్రణయనాదులను శ్రీస్వామి మనుష్ఠించు వైఖరి అనన్వయాలంకారలక్ష్యముగ చెప్పనగును. శ్రీ స్వామి యాస్థానము నలంకరించినదిమొదలు నేటివఱకు త్రికాలానుష్ఠానములను, భగవదారాధనములను, ఉభయవేదాంత ప్రవచనములను, స్వరూపానురూపకైంకర్యములను జరిపించుక్రమమును చూచిన సూర్యచంద్రాదులయొక్క ఉదయాస్తమయాదివ్యవస్థకూడ దీనికి సాటికాదనవచ్చును. ఇట్టి మనోహార్యము శ్రీభాష్యకారాది పూర్వాచార్యానంతరము ఇచటనే కన

బడుచున్నది. ప్రకృతివశముగ నారోగ్యవైకల్యము తటస్థించి నను అప్పుడుకూడ అనుకల్పాశయణముచేయుక ముఖ్యకల్పము గానే జరిపించుట * న భూతో న భవిష్యతి * అనియే అను సంధింపవలసియున్నది. ఈస్థితికి పల్లాంపుపాడుటయే మనకు కర్తవ్యము.

శ్రీ స్వామి ఆశ్వినమాసమున నభిమిక్తులైరిగాన సమీపముననే ధనుర్మాసముసమీపించెను. అప్పుడును *కథంన్వపరరాత్రేషు సరయూమవగాహతే * అనిభక్తులు కష్టపడునట్లు రాత్రి మూడవజామమునసే చెఱువునకువేంచేసి అనుష్ఠానములనుముగించుకొని యథాకాలము భగవదారాధనము ప్రారంభింతురు. అది మొదలిదివసుకు నిత్య శ్రీర్నిత్య మంగళముగ ఒక్కొకపనియు జరుగుచున్నవి. ఇక చరిత్ర విశేషముల ననుభవింతము.

శ్రీమన్మహారాజసంస్కృతపాఠశాలలో వెనుకటి మహాప్రభు మకుటాభిషేకదినస్మారకచిహ్నముగ మాఘ శుక్లసప్తమినాడు ప్రతిసంవత్సరమునను జరుగు సదస్సునకు అసంవత్సరమున శ్రీస్వామిని అగ్రాసనమునహింపవలయునను విద్యాలయాధ్యక్షులప్రార్థనానుసారము అగ్రాసనమువహించి అత్యద్భుతముగనుపన్యసించిరి. ఇటులనే యనేక సందర్భములుజరిగెను. మూర్తాభిషేకమయినది మొదలు ఐదు మాసములు శ్రీ మఠమునసేవేచేసియుండి, పిమ్మట కావేరీ తీరమున స్వల్పకాలము వసింపవలయుననితలంచి శ్రీరంగ పట్టణసమీపమున కావేరి యుత్తరభాగమునగల కొప్పల్

మఠమున సపరివారులై రెండుమాసములు వసించియుండిరి. శ్రీ శ్రీనివాసబ్రహ్మతంత్రపరకాల మహాదేశికులకాలమున నేర్పడిన యీ కొప్పలుమఠము శిథిలముగనుండుటచే జీర్ణోద్ధారణముచేయించి, బాలాలయముననుండిన శ్రీ లక్ష్మీహయగ్రీవులను ప్రతిష్ఠింపించి, వెండిలో నొక లక్ష్మీహయగ్రీవ మూర్తినివేంచేపించి, పూర్వాచార్యులయర్చావిగ్రహములను చిద్ద ఆకారములో వేంచేపించి, కొన్నియపూర్వ పరిష్కారములనుజేసిరి. ఈ కైంకర్యములనుద్దేశించియే కొప్పల్ మఠమునకువేంచేసిరిగాబోలు. పిమ్మట నొన్ని మాసములలో మైసూరునకుతిరిగివేంచేసిరి. రాజగృహమున ప్రతిజ్యేష్ఠమాసమునను జరుగు శ్రీమన్మహారాజ నాల్వడి కృష్ణరాజవర్ణంతినాడు పూర్వపద్ధతిననుసరించి శ్రీ పాదతీర్థమునన్నుగహింపవలయునని ప్రార్థింపపడి శ్రీస్వామినుర్యాదలతో వేంచేసి యన్నుగ్రహించి, మహారాజుచేతను స్వర్ణపుష్పార్చనాదులనుపొంది, తామును మహారాజునకు బహుమానమునన్నుగహించిరి. ఇదేరీతిగ ఇప్పుడుకూడ శ్రీ జయచామరాజేంద్రవర్ణంతినాడు శ్రీపాదతీర్థము నన్నుగహించుట మున్నగునవి యథాక్రమముగ జరుగుచున్నవి.

శ్రీ లక్ష్మీహయగ్రీవుల తిరునక్షత్రమునకు పూర్వాంగముగ ౧౫ దినములు చాతుర్మాస్యసభయను వేదశాస్త్ర విద్వత్సభ త్రిమతస్థులకును సాధారణముగ జరుగుచున్నది.

ఒకసంవత్సరమున సంకల్పోత్థానమునకు ఆలనళ్ళి యన్నుగామమునకు వేంచేసిరి. అచట స్నానాదుల కనుకూల

మగువసతియుండుటనుజూచి శ్రీలక్ష్మీహయగ్రీవుని కొకతూరి ధనుర్మాసారాధనము నచట జరిపింపవలయునని తలంచి కార్తికమాసావసానమునసే యచటికివేంచేసిరి. ఇటీవల శ్రీరంగపట్టణము కొప్పలుమఱమున వేంచేసియుండినపుడే శరీరమున కొంచమపాటవముకల్గెను. దానిని కొంచమయినను లక్ష్యముచేయక యథాక్రమముగ త్రికాలానుష్ఠానాదులను అనుష్ఠించుకొనియుండుటచే ఈ సమయమున నాయపాటవము అధికమయ్యెను. ఈ వ్యాజముగ శ్రీలక్ష్మీహయగ్రీవులకు ప్రతిదినము పది సహస్రనామార్చనలనుచేయుచుండిరి. అతి విస్మయనీయమగు ఆహారనియమాదులమ స్వీకరించుట చేతను క్రమేణ ఆరోగ్యముగల్గెను.

శ్రీలక్ష్మీ హయగ్రీవాస్థానమున ౨౫వ పట్టమున నభిషిక్తులై, బ్రహ్మచర్యాశ్రమమునుండియే ౨౮వ ప్రాయమున తురీయాశ్రమమును స్వీకరించి శ్రీమతి మహారాణిలక్ష్మన్నిణి గారియొక్క ప్రార్థనచే తిరువులనుండి మైసూరునకు వేంచేసి నగరవాసమున విరక్తులై ౭౮ చాతుర్మాస్యములు సంకల్పించి ౧౦౨ తిరునక్షత్రములు వేంచేసియుండిన జ్ఞానభక్తి విరక్తిమూర్తియయిన శ్రీ రామానుజ బ్రహ్మతంత్రపరకాల మహాదేశికుల బృందావనమును సేవింపదలంచి కావేరీతీరసమగు కృష్ణాపురమునున్నగహారమునకు వేంచేసిరి. అచటను శ్రీ సన్నిధిశాఖామఠముండుటచే అచట వేంచేసియుండి భగవద్భాగవతారాధన ఉభయవేదాంతగ్రంథ కాలక్షేపములను జరిపించుచునుండగా, శ్రీమత్పరమహంసేత్యాది రీమాస్వామికి వర్ష తిరునక్షత్రోత్సవము ప్రాప్తముకాగాతత్సేవార్థము పలు

భాగవతోత్తములును, సోసలైజోడీదారు తిరుమలైశ్రీనివాసాచార్య ప్రభృతులును, సత్యాగాలము రంగప్ప తాతాచార్యులును వచ్చియుండి శ్రీశ్రీస్వామియాధ్యక్ష్యములో 'సత్యమంగలతీర్థామృతవర్షిణీ సభ'యను నొక సమాజము నేర్పఱచిరి. పూర్వము * తురుష్క-యవనాదిభిర్జగతి జృంభమాణం భయం * అని యభీతిప్రవమున సాయించినట్లు శ్రీరంగమున తురుష్కపదవమధికమైనప్పుడు అచట వసింపనలవిలేక శ్రీశ్రుతప్రకాశికాభట్టుల కుమారులతో స్వామిదేశికులు సత్యాగాలమున ౧౭ సంవత్సరములు జ్ఞానాశ్వత్థముయొక్క అడుగున తిరుక్కావేరిలోస్నానముచేసి శ్రీవరదరాజప్పెరుమాళ్ళ సన్నిధికేరిన తాయారుసన్నిధియెదుట కూర్మాసనమున వేంచేసియుండి కాలక్షేపములనడిపించుచుండిన విషయ మితిహాససిద్ధము. ఆ కూర్మాసనమును జీర్ణోద్ధారముచేయవలయునని ఆ సమాజమున ప్రస్తావింపబడెను. శ్రీస్వామి ఆలనళ్ళిగ్రామమునవేంచేసియుండినపుడే ఈ జీర్ణోద్ధారవిషయము ఒకదినము స్వప్నమున స్వామికి ఒకవృద్ధభాగవతోత్తములచే నియమింపబడియుండెను. దానినితెలిపి యా కూర్మాసనవైభవమునువ న్యసించిరి. అప్పుడే యాజీర్ణోద్ధారమునకుగావలసిన ద్రవ్యములను సంపాదింపబడి, అచటినుండి మైసూరునకువేంచేయదలంచి, సోసలైయజమానుల సవినయప్రార్థనానుసారము వారిగృహమున రెండుదినములు శ్రీలక్ష్మీ హయగ్రీవారాధనము డోలోత్సవముమున్నగు వానిని జరిపించి అనుగ్రహించి మైసూరునకు వేంచేసిరి.

మైసూరు శ్రీసన్నిధిలో స్వామికి అవగాహనస్నాన సౌకర్యములేకుండుటను ఈ కారణంబుచేతనే స్వామి కావేరీ తీరగ్రామములకు వేంచేయుచున్నారనియు మహారాజుగారు తెలుసుకొని ఆశ్రమ స్వీకారమునకు పూర్వము వాగ్దానము చేసియుండిన యనుపపత్తిపరిహారప్రతిజ్ఞలో నీ స్నానా సౌకర్యమును పరిహరింపదలంచి అతి శీఘ్రముగ శ్రీసన్నిధికి పడమటనుండిన ౨ గృహములను క్రయమునకుతీసి యొక పుష్కరిణినినిర్మించి స్వామినిత్యకర్మానుష్ఠానములకు పరమ సౌకర్యములంజేసిరి. అదిమొదలు స్వామికి గ్రామాంతరజిగమిషయు నిల్చెను.

శ్రీస్వామి మైసూరునకువేంచేసినపిమ్మట సత్యాగాలమున చేయదలంచియుండిన జీర్ణోద్ధారణకైంకర్యము అతి శ్లాఘ్యముగ ఒకటిన్నర సంవత్సరములోపలనేచేసి ముగింపబడెను. శ్రీ వరదరాజప్పెరుమాళ్ళు తాయారుసన్నిధి పూర్వభాగమున కూర్మాపసముండినస్థానములు జేర్చి ౬ అంకణములుగల రాళ్ళమంటపముకట్టిముగించిరి ఆ మంటపప్రతిష్ఠోత్సవమునుకూడ శ్రీస్వామియే సపరివారులై వేంచేసి విభవవర్షమున అత్యద్భుతముగ జరిపించిరి.

సత్యాగాలమున ప్రకృతకూయుసనకైంకర్యము ముగించినవెంటనే అచ్చటివరదరాజప్పెరుమాళ్ళసన్నిధి వైదికకార్యనిర్వాహభాగమునకు మదరాసు ఎండోమెంటుబోర్డు యొక్క అధికారులు శ్రీబ్రహ్మతంత్ర స్వతంత్రపరకాలాస్థానమున వేంచేసియుండుస్వాములు పరంపరగ ట్రస్ట్రీలుగ

నుండవలయుననియు, ఇతరట్రస్టీల నిద్దఱనుకూడ శ్రీ స్వామియే నియమింపవలయుననియుతీర్మానింపబడి ఇపుడునుఅటులేజరుగుచున్నది. పిమ్మట నాలుగయిదువర్షములయిన వెనుక పై పెరుమాళ్ళసన్నిధి సమీపముననుండు గలిరాయన్ మలైరాముని సన్నిధికిని యథాపూర్వము ట్రస్టీలుగతీరుమానింపబడి నడచుచున్నదేకాకయు అచటవచ్చు యాత్రికులవాసమునకై తాయారుసన్నిధికి దక్షిణభాగమునగల భూమిని క్రయమునకుతీసి అచట ౧౮ అంకణములుగల ఱాళ్ళకట్టడమును, పై రెండుసన్నిధికైంకర్యపరులవాసమునకై పై మంటపముతో చేరియే వాసస్థలమునుకట్టిరి.

శ్రీ కృష్ణ బ్రహ్మతంత్రపరకాల మహాదేశికులు శ్రీమఠమును అతివిచిత్రరమణీయసన్నివేశములతోను ఉద్ధరింపించినను కలశప్రతిష్ఠచేయవలయునను మనోరథముమాత్రము ముగియకయేయుండెను. దానిని మనస్వామి పూర్తిచేయింపదలంచి, సౌవర్ణపంచకలశప్రతిష్ఠచేసి ముగించిరి. శ్రీ సన్నిధిలో క్రొత్తగనేర్పడిన పుష్కరిణిని శ్రీహయగ్రీవపుష్కరిణియను పేరితో ప్రతిష్ఠచేసిరి. (ఇవి శుక్లవర్షమునజరిగినవి.)

దీనికి పిమ్మట శ్రీస్వామి ఇతరదేశసంచారములను సవాసనముగ నిలుపుకొని ఆస్థానముననే వేంచేసియుండి శిష్యులకు అధ్యాత్మశాస్త్రప్రవచనములను అత్యాశ్చర్యముగను అవిచ్ఛిన్నముగను జరిపించుచున్నారు. మనవైదికవిద్యాభివర్ధననిషయమున శ్రీస్వామి శ్రద్ధతో జరిపించు కార్యములు అతిమానుషములనదగును. శ్రీ సన్నిధిలో వేదాంతాధ్యయ

నముచేయుదలంచు శిష్యులకు ప్రతిమాసమును వేతనము (జీతము)లనిచ్చియు, సంస్కృత ద్రావిడవేదములు నిరంతరముగ శ్రీసన్నిధిలో ప్రవచనమగునట్లు వ్యవస్థజేసియు, శ్రీమన్మహారాజ సంస్కృతపాఠశాలలోచదువు శ్రీవైష్ణవ విద్యార్థులకు ఈసన్నిధిలోనే నిత్యభోజనసౌకర్యము నియమించియు మహారాజ ఆంగ్లకలాశాల ఆయుర్వేదకలాశాలయున్నగు వానిలో అన్వయించు బ్రాహ్మణులకును తదితరులకును ప్రతిదినము సాపాటకిచ్చునట్లు నియమించియు, ఇట్లు పలువిధముగ నుపకరించియు, విద్యాభివర్ధనవిషయమున జాతిభేదాది దృష్టిలేకయే ప్రోత్సహించుప్రక్రియను ప్రత్యక్షముగనే చూడనగును. శ్రీసన్నిధిలో ఏసమయముననేగినను కర్ణపేయముగ నమృతధ్వనుల ననుభవింపవచ్చును. శ్రీ సన్నిధికి ముఖ్యశిష్యులయిన శ్రీమత్కర్ణాటసింహాసనాధీశ్వరులకును, తదనుబంధి బంధువర్గములకును సకలశ్రేయస్సులను వృద్ధియగునట్లు శ్రీలక్ష్మీహయగ్రీవ లక్ష్మీనారాయణులకు త్రికాలారాధనములు కాలవిపర్యయాదిదోషములులేక జరిపించువిషయము వర్ణనాతీతము. * న కాలస్తవై ప్రభుః * అనియు * యత్కాలాదపచేలిమం * అనియు చెప్పునట్లు కాలాతీతమయిన పరమపదమున జరుగవలసినక్రమములీప్రపంచమున శ్రీస్వామి సన్నిధిలో మాత్రము అద్వితీయముగ నవిచ్ఛిన్నముగ జరుగుచునుండుటచే బహుకాలమిటులే జరుగవలయునని మంగళాశాసనముచేయుటయే మనకర్తవ్యము. శ్రీమద్వేదమార్గప్రతిష్ఠాపనాచార్య ఉభయవేదాంత ప్రవర్తకాచార్యత్యాది బిరుదావళులు మన స్వామియందే ముఖ్యవృత్తులనదగును. శ్రీవైష్ణవబ్రాహ్మణసచ్ఛిష్యులు పరిశుద్ధముగా వెంచేపు చేసిన తులసిచే శ్రీలక్ష్మీహయగ్రీవులకు కోటియర్చనలుముగించి రెండవకోటిలో 77 లక్షలుపూర్తియయి 73లక్ష ఇంకను అవిచ్ఛిన్నముగ జరుగుచున్నది. ఈయర్చనకుగానే శ్రీసన్నిధిక్షేత్రమున తులసితోటలు అభివృద్ధిచేయబడుచున్నవి.

శ్రీ లక్ష్మీహయగ్రీవరజతమంటప నిర్మాణము.

ఈ సన్నిధిలోనిపుడు లక్ష్మీహయగ్రీవులు వేంచేసియుండు రజతమంటపము మనస్వామి నియమనముచే 1986వ సంవత్సరము నిర్మింపపడి ప్రతిష్ఠితమయ్యెను. దీని సౌందర్యము సర్వజనానుభవసాక్షికమైయున్నది.

శ్రీమద్వేదాంతదేశికవిహారసభాస్థాపనము.

వైదికవిద్యాభిరుచి ప్రోత్సాహనార్థమై 1928 సం॥లో 'శ్రీమద్వేదాంతదేశికవిహారసభ'యని యొకసభను యేర్పరిచి దీనికై రూపాలు. 10000 మూలధనముగ నేర్పరుచపడియుండెను. దాని వడ్డినుండి యుద్దిష్టకార్యములను జరిపించుటకుశక్యమనితలంచి పిమ్మట 15వేలు రూపాయలుచేర్చి మొత్తము రూపాలు. 25000 అగుటచే దానిని చారిటిబిల్ ఎండోమెంటుగచేసిరి. పూర్వము కనుపఱచిన శ్రీ హయగ్రీవజయన్తికి అంగముగా రీమాస్వామికుని ప్రసిద్ధిజెందిన 30వ పట్టములో అభిషిక్తులైన శ్రీరంగనాథ బ్రహ్మతన్త్ర పరకాలమహాదేశికులచే 1878 సం॥కు సరియైన పూర్వ బహుధాన్యసంవత్సరములో ప్రారంభింపబడి అదిమొదలు ఇది

వఱకు నిర్విఘ్నముగా జరుగుచున్నందున 1938 సం॥ సరియైన బహుధాన్య సంవత్సరములో 25000 రూపాయల వృద్ధ్యంశముతోను, ఈ సభకుగాను క్రయమునకుతీసియుండు నాలుగు గ్రామములనుండివచ్చు ఆదాయముతోను, పైసభ ప్రారంభింపపడి అదిమొదలు ప్రతిసంవత్సరమును ఉత్తరోత్తరాభివృద్ధిగ జరుగుచున్నది. ఈసభ ప్రతివర్షము ఈభాష్యకారుల తిరునక్షత్రోత్సవమునకు ఉత్తరాంగముగ మఱుదినమె ప్రారంభించి శ్రవణనక్షత్రమున సన్మానాంతముగ పూర్తియగుచున్నది. వేదదివ్యప్రబంధ ఈభాష్యాదులయందు పరీక్షయిచ్చి ఉత్తీర్ణులయనవారికి సంభావనచేయుటకే యీసభయేర్పడినది. ఐదాఱువర్షములుగ నీ సభాకార్యక్రమములు అత్యుత్తయగ జరుగుచున్న విషయము జగత్ప్రసిద్ధము శ్రీస్వామి విశాలహృదయమునకుదగినట్లు ఈ సభచేత మన సంప్రదాయ గ్రంథాధికారులు మైసూరు మదరాసు ప్రాంతములయందు అదికముగ నభివృద్ధియగుచున్నారు. ఈ సభకై శ్రీస్వామి సంకల్పించిన మూలధనముమాత్రమేగాక ఇతరధార్మికోత్తములైన కామలాపురం బాణగిరి పెద్దనరసింహాచార్యులును కుంభకోణమురంగయ్యంగారులకుమార్తె శ్రీమతిలక్ష్మమ్మయు నిచ్చినద్రవ్యమును మూలధనమున జేరి పైరగు గ్రామములలో నొకగ్రామమైనది. పరీక్షలలో ప్రథమమును తీర్ణులగు విద్యార్థులకు విశేషబహుమానముచేయ ధార్మికులు కొందఱు అనగాధర్మాధికారగురుసేవ్యాక్త శ్రీ తిరువళ్ళూరు శ్రీనివాస రాఘవాచార్యులు, ఇంజనీయర్ కే. శ్రీనివాసయ్యంగారు, డాక్టర్ వరదాచార్యులు, విద్వాన్ పుసులూరు శేషాచా

ర్యులు అనువారు మూలధనముచేర్చియుండుటచే దానివడ్డినుండి విశేషబహుమానము చేయబడుచున్నది.

మాగడిలో జీర్ణోద్ధారము.

శ్రీలక్ష్మీహయగ్రీవాస్థానమున 21వ పట్టమున వేంచేసియుండిన పెరియపరకాలమహాదేశికులు అరకలగూడు అను గ్రామమున అవతరించినను పెద్దలువసించిన మాగడియను గ్రామమునవసించుచుండిరి. ఈస్వామి 23వ వయస్సుననే సంన్యసించి 60 చాతుర్మాస్యము లనుభవించిరి. వీరు ఉత్తరదేశయాత్రవేంచేసి డిల్లీ మహాప్రభుచే విశేషముగ సన్మానింపబడి, సకల దివ్యదేశములలోను శ్రీమన్నిగమాంత మహాదేశికదివ్యమంగళవిగ్రహమును అర్చారూపముగ ప్రతిష్ఠచేసి, మైసూరుదొడ్డ కృష్ణరాజవుడైయర్లకు చక్రాంకనాదుల ననుగ్రహించి, ఆకాలమున ప్రబలముగానుండిన శైవవైష్ణవ వివాదమున జయమునొంది సిద్ధాంతస్థాపనముచేసి ఆర్తప్రపత్త్యనుష్ఠానముచే పరమపదమునకు వేంచేసినవారు. ఇట్టి మహానుభావులతిరుమాళిగ మాగడిలో జీర్ణముగనుండుటచే దానిని మాగడిలోయుండు శ్రీమఠమునకుచేర్చుకొని మాగడి శ్రీమఠమును ఈ మఠమున వివాహోపనయనములు మొదలైన విశేషోత్సవములు తదీయారాధనలుసహా జీరోద్ధారము చేసిరి.

రామనాథపురమున ధర్మసత్రపరిష్కారము.

రామనాథపురమను గ్రామసమీపమున కావేరీతీరముననుండు రాజకీయనత్రమును తద్గ్రామజనులప్రార్థనచే

సన్నిధికిచేర్చుకొని విశేషముగ జీర్ణోద్ధారముచేసిరి. అందు అందఱు వివాహాదులు జరిపించుటకు సౌకర్యముగనున్నందున అదేరీతిగ జరుగుచున్నది. అచట శ్రీలక్ష్మీహయగ్రీవులను శ్రీ దేశికులను ప్రతిష్ఠింపడలంచియున్నారు.

తిరుమలలో జీర్ణోద్ధారము.

తిరుమలలోనుండు శాఖామఠము చిన్నదిగనుండుటచే ప్రక్కననుండుస్థలములను క్రయమునకుతీసి పెద్దమఠముగ కట్టించిరి. ఇటులే దిగువ తిరుపతిలోనుచేయించిరి.

బెంగళూరిలో శ్రీమఠస్థాపనోద్యమము.

బెంగళూరిలో శ్రీసన్నిధి శాఖామఠముకట్టనారంభించి కార్యములు జరుగుచున్నవి. శీఘ్రముగనేపూర్తికాగలదు.

శ్రీకంచి తూప్పులులో మహత్తర కైంకర్యము.

శ్రీ సన్నిధిమూలపురుషులయిన శ్రీబ్రహ్మతంత్ర స్వతంత్రస్వామికి కంచిలో నొకమఠమును, ఒకపుస్తక భాండాగారమును పూర్వకాలముననేయుండినట్లు శాసనమూలముగ తెలియవచ్చినను దానిని కనుపెట్టుసాధనములు లేకుండెను. శ్రీ కృష్ణబ్రహ్మతంత్రపరకాల మహాదేశికులకాలముననుండిన మనోరథము ఇపుడు మనస్వామికాలంబున పూర్తియయ్యెను. శ్రీ దేశికులతిరువవతారస్థలమయిన తూప్పులులో శ్రీ దీప ప్రకాశప్పెరుమాళ్ళ సన్నిధిసమీపమున జటాబ్రహ్మచారి యని ప్రసిద్ధులయినవిరక్తశిఖామణి ఆరావముదయ్యంగారను వారు అనేకసంవత్సరములుగ బహు ముఖమయిన కృషులను

జేసి తూప్పులులో నొకపాఠశాలను స్థానవిశేషమును ఏర్ప ఱచి కొంచము మూలధనమునుచేర్చియు, ఇది సురక్షితము గాను శాశ్వతముగాను జరుగవలయుననిదలంచి శ్రీ స్వామి సన్నిధిలో ప్రార్థింపగా, శ్రీస్వామియు, శ్రీ సన్నిధికూటస్థులయిన బ్రహ్మతంత్రస్వాములు తూప్పులులో శ్రీమన్నిగమాంత మహాదేశికులసన్నిధిలో మొట్టమొదట శ్రీభాష్యము మున్నగువానిని కాలక్షేపముచేయుటచేతను, శ్రీసన్నిధి ౨౨వ పట్టమున అభిషిక్తులైయుండిన బ్రహ్మతంత్ర శ్రీనివాసపరకాల మహాదేశికులు తూప్పులులో దేశికులసన్నిధిని జీర్ణోద్ధారణము చేసినట్లు శాసనమూలముగ తెలియుటచేతను, తూప్పులులోను మన సన్నిధికొకస్థానమావశ్యకమని తలంచి, ఆస్థాన విశేషమును సన్నిధికిచేర్చుకొని, బహుకాలమునకు పూర్వము శ్రీసన్నిధిలో వేంచేసియుండిన శ్రీలక్ష్మీహయగ్రీవులను శ్రీ దేశికులను, వారి పాదుకలయిన బ్రహ్మతంత్రస్వతంత్రస్వామి కుమారవరదాచార్యులను తూప్పులులలో ఆస్థానమున ప్రతిష్ఠితమైనమూలబేరములతో వేంచేపుచేయించి, (938 సం॥)కు సరియైన బహుధాన్యవర్షమున విశేషోత్సవాదులను జరిపించిరి. అదిమొదలు 'తూప్పులు బ్రహ్మతంత్ర స్వతంత్ర పరకాలమఠము'ని వ్యవహరింపబడుచున్నది. జటాబ్రహ్మచారి స్వామి సేకరించిన మూలధనము అపర్యాప్తమనిదలంచి భూతపూర్వమహారాజశ్రీమన్నాల్వడి కృష్ణరాజవుడైయార్లకు తెలిపి వారి యనుమతిప్రకారము 30000 రూపాయలు చార్టిబిల్ ఎండోమెంటుగ సుస్థిర మూలధనముచేసి ఆ కైంకర్యమును చక్కగ జరిపించుచ్చునారు.

ధనుష్కోటిలో కైంకర్యము.

కాంచీపురముననుండిన పట్టణత్తాచార్యస్వామి బహుదినములుగ ధనుష్కోటిలోవసించుకొని యాత్రీకుల సౌకర్యార్థమై పలు ధార్మికుల ద్రవ్యసహాయముచే శ్రీకోదండ రాముని సన్నిధినిట్టి ప్రతిష్ఠచేసి భాగవతారాధనముచేయు చుండిరి. ఈ కైంకర్యము అవిచ్ఛిన్నముగ జరుగవలయునని వారు ఆ సన్నిధిని శ్రీసన్నిధికి రాజాంగ శాసనమూలముగ చేర్పగ, ప్రకృతము శ్రీసన్నిధిమూలముగానే యన్నియు నడచుచున్నవి. దీనికై శ్రీస్వామిచే రూపాలు ౨౫౦౦ మూల ధనము స్థాపింపబడెను.

ఆళ్వార్ తిరునగరికైంకర్యము.

ఆళ్వార్ తిరునగరిలో శ్రీ దేశికులసన్నిధి ౨౧ వ పట్టము శ్రీ పెరియపరకాల మహాదేశికులచే స్థాపించబడి పిమ్మట మైసూరుదేశ రాజాంగశాసన మూలముగ అచ్చటి కైంకర్యమునకు గ్రామమేర్పడియున్నను కాలవ్యత్యాసము చేత అన్యథాఅయినది. ప్రకృతము ఆ శ్రీదేశికసన్నిధి శ్రీ సన్నిధికిచేరినది.

తిరుక్కుఱుంగుడి కైంకర్యము.

దక్షిణభారతభూమికి మేరయయిన తిరుక్కుఱుం గుడిలో శ్రీదేశికులసన్నిధి మనస్వామి కాలమున రాజాంగ శాసనమూలముగ స్వాధీనముచేసుకొనబడినందున అక్కడ శ్రీసన్నిధిమూలముగానే నిత్యకైంకర్యాదులు జరుగు చున్నయవి. ఈ కైంకర్యమునకు నూతనముగా గ్రామ

మును శ్రీముషములోనె వేర్పరచడమగును. ఇంకను పలుస్థలము లలో శ్రీ సన్నిధి శాఖామఠములనుగల్గు మనోరథముగలదు.

దివ్య గ్రంథరచన.

పూర్వాశ్రమమున రచించినవి పాదుకాస్తుతి, ధర్మ సూక్తివివరణము, ఈశావాస్యభాష్యవివరణము (అపూర్ణము) మున్నగునవి. ఆస్థానము నలంకరించినపిమ్మట యహశిర ఉపా ఖ్యానవ్యాఖ్యానము, హయశిరోరత్న భూషణము, తద్దీధితి ఇవి యచ్చులోనుండునవి. సర్వార్థసిద్ధికి వ్యాఖ్యానముగ సాయించిన భావప్రకాశమున తృతీయసంపుటము అచ్చగు చున్నది. ఉపనిషదర్థవిశేషనిరూపణపరమయిన ఔపనిషద మణిహారమను గ్రంథరత్నమును స్రగ్ధరావృత్తమున సాయించు చున్నారు.

అనేకగ్రంథముద్రాపణకైంకర్యము.

మన సంప్రదాయగ్రంథములను సుపరిష్కృతముగ నచ్చువేయించి జగదుపకారముచేయుటలో మన స్వామికి గల వైయగ్ర్యము వాచామగోచరము. అల్పజ్ఞుడును అల్ప శక్తిగలవాడునగు దాసుడు శ్రీమద్వేదాంతదేశిక గ్రంథ మాలను అచ్చువేయనారంభించినపుడు శ్రీస్వామియాదరాతి శయము అపరిమితమయినది.

యతీంద్రాణామేషాం పరమకృపయా వాఙ్మనసయోః
అభూమార్థ స్వచ్ఛందప్రసరమపయాంతార్థ ప్రతికలమ్!
ఇదం త్రయ్యంతార్థ ప్రపరకృతిమాలాప్రకటనం
యథావత్సంపూర్తిం సమభజదితి ఖ్యాప్యత ఇహ॥

అని దాసుడు ప్రచురించిన శ్లోకమునేయిచట జ్ఞాపకము చేయు
చున్నాడను. శ్రీ దేశికగ్రంథమాలలో సంప్రదాయ విభాగ
మును స్వకీయముగ స్వీకరించి పూర్తిచేయించినది విశ్వ
ప్రసిద్ధము. భగవద్విషయము ఆఱాయిరప్పడిని ప్రత్యేకముగ
నచ్చువేయించినది, నిత్యానుసంధానము తిరువాయ్ మొఱ్ఱి
మున్నగు అత్యంతోపయుక్త దివ్యప్రబంధములను మహోప
కారముగ ముద్రణముచేయించినది మున్నగునవి-భూతభవిష్య
ద్వర్తమానములనునివియున్నియు శ్రీ వైష్ణవలోకమునకు
చేయు మహోపకారములు. శ్రీ సన్నిధి కూటస్థులయిన
బ్రహ్మతంత్రస్వతంత్రస్వామి ఆఱ్వారులవిషయముగ దివ్యసూరి
స్తోత్రము సాయించుటచేతను, తృతీయ బ్రహ్మతంత్రస్వతంత్ర
స్వామి ఆఱ్వారులవాఱ్ఱి తిరునామమును సాయించుటచేతను,
ఆఱాయిరప్పడికర్తయయిన శ్రీ పిళ్ళానువంశమున సవతరిం
చిన పెరియపరకాలమహాదేశికులు నాలాయిర దివ్యప్రబం
ధములకు వ్యాఖ్యానము సాయించియుండుటచేతను శ్రీ కృష్ణ
బ్రహ్మతన్త్రపరకాల మహాదేశికులచే నారంభింపబడిన దివ్య
ప్రబంధ వ్యాఖ్యానముద్రణము పూర్తికాకపోవుటచేతను మన
స్వామికి దివ్యప్రబంధవ్యాఖ్యాన ప్రకాశనమున నభిరుచిగలు
గుట న్యాయమే.

నాలాయిర దివ్యప్రబంధవ్యాఖ్యానముద్రాపణము.

తిరువాయ్ మొఱ్ఱి వ్యాఖ్యానముగ పిళ్ళాన్ సాయిం
చిన ఆఱాయిరప్పడి, సాక్షాత్స్వామిసాయించిన ఇరుపత్తి
నాలాయిరప్పడి శబ్దార్థము, శ్రీరంగరామానుజస్వామి

సాయించిన సంస్కృతవ్యాఖ్యానమయిన ఒన్బతినాయిరప్పడి,
పెరియపరకాలస్వామి సాయించిన పదినెణ్ణాయిరప్పడి,
సవ్యాఖ్యాన ద్రమిడోపనిషత్తాత్పర్యరత్నావళీ ద్రమిడోప
నిషత్సారములు అనునివిచేరిన భగవద్విషయము పూర్వమే
ద్రావిడలిపిలో ముద్రితమైయుండినను తెనుగులిపిలో ముద్ర
ణముగాని కొఱతనుతీర్చుటకై తెనుగులిపిలోనచ్చువేయింప
దలంచి శ్రీస్వామి పరమకృపతో నీకార్యమున దాసుని నియ
మింప, దాసుడు నాయాజ్ఞను శిరసావహించి మూడునాలుగు
వర్షములుగ నీ మహాకార్యమును పూర్తిచేయించితిని. భగవ
ద్విషయముద్రాపణము పూర్తియయ్యెను. ఇటులే మూవా
యిరమునకును పెరియ పరకాలస్వామి బహుశః సాయించిన
వ్యాఖానములనుకూడ ముద్రింపనియమింప, మొదలాయి
రముననేకభాగమును, పెరియతిరుమొఱ్ఱిలో సగమును
ముద్రితమై క్రమముగ కార్యములు జరుగుచున్నయవి. ఇంక
నిట్టి యనేక మహత్తరకార్యములను జేయదలంచియున్నారు.

ఇట్లు పలువిధంబుగ విలక్షణజగదుపకారములను
జేయుచు అన్యాదృశవైభవముతో సేవసాదించు మనస్వామి
వైయమ్మన్ని వీఱ్ఱిరుందు విణ్ణుమాళ్వర్ మణ్ణూడే అను
నట్లు దాసవర్గములతోనే నిత్య శ్రీర్నిత్యమంగళముగ విరా
జిల్లుచునుండవలయునని ప్రార్థించుచున్నారము.

అభినవరంగనాథపరకాల మహాయమినాం
అనవధివైభవం కథమసౌ మితధీః కథయేత్ ।
తదపి రమాహయాస్యకరుణా పరిణామవశాత్
లఘుతరమేవ కించిదుపవర్ణ్య కృతీ సమభూత్ ॥

శ్రీస్వామివైభవ మహార్ణవశీకరాత్మా
సైషా కృతిస్సుమనసాం హృది భాతి యేషాం।
తేషాం ధ్రువం సకలసంపద ఆదరేణ
సంపాదయేత సతతం కమలాహయాస్యః॥

శ్రీ లక్ష్మీహయగ్రీవ దివ్యపాదుకాసేవక శ్రీమదభినవ
రంగనాథ బ్రహ్మతంత్రపరకాల మహాదేశికుల
వైభవ సంగ్రహము సంపూర్ణము.

రాజా ధార్మికో విజయీ భవతు.

సమస్త సన్మంగళాని సన్తు.

G. GopalaChary